తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
కరీంనగర్ - నిజామాబాద్
రాజన్న సిరిసిల్ల | కామారెడ్డి
పెద్దపల్లి | జగిత్యాల
ఆదివారం
28 సెప్టెంబర్ 2025
పేజీలు : 8
Follow :




## కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో
# బతుకమ్మ సంబరాలు

### ఘనంగా నిర్వహించిన పోలీస్ కమిషనర్ ఆలం గౌస్





**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవం, సాంప్రదాయ సాంస్కృతిక వైభవానికి ప్రతీక అయిన బతుకమ్మ సంబరాలను కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కేంద్రంలోని అస్త్ర కన్వెన్షన్ హాలు నందు అత్యంత అంగరంగ వైభవంగా నిర్వహించారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఆదేశాల మేరకు కమిషనరేట్‌కు చెందిన మహిళా సిబ్బంది, అధికారులు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ లు కుటుంబ సమేతంగా హాజరయ్యారు.కమిషనరేట్‌కు చెందిన మహిళా ఉద్యోగులు తమ తమ బతుకమ్మలను తీసుకువచ్చి, సాంప్రదాయ బతుకమ్మ పాటలతో, పూల అందాలతో ఉత్సాహంగా ఆడిపాడారు. అస్త్ర కన్వెన్షన్ హాలు బతుకమ్మలతో కళకళలాడింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, “బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడబిడ్డల గౌరవం, సాంప్రదాయం, సమైక్యతకు ప్రతీక. మహిళలు ఉద్యోగాల్లోనూ, కుటుంబాల్లోనూ సమానంగా వెలుగొందుతున్నారు. ఇలాంటి పండుగలు మహిళా శక్తిని ప్రపంచానికి చాటుతాయి” అని తెలిపారు. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ, “బతుకమ్మ లాంటి పండగలు, ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఉద్యోగుల్లో ఐక్యతను పెంపొందిస్తాయి. సమాజానికి ఇవి ఒక స్ఫూర్తి” అని అన్నారు. ఉద్యోగులు కేవలం సేవలకే పరిమితం కాకుండా, సాంస్కృతిక విలువలను కాపాడుతూ పండుగను ఘనంగా జరపడం వారిలో మరింత ఉత్సాహాన్ని పెంపొందిస్తుందన్నారు. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతికి కిరీటమణి అని, ఈ పండుగలో ఉద్యోగులు, మహిళలు, సభ్యులు ఉత్సాహంగా పాల్గొనడం ఆనందదాయకం అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనరేట్ కి చెందిన మహిళా పోలీసు సిబ్బంది,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గొర్రెలను ఢీకొన్న ఆర్టీసీ బస్సు
### 10 గొర్రెలు మృతి

**సుల్తానాబాద్,సెప్టెంబర్ 27(జనంసాక్షి) :** ఆర్టీసీ బస్సు ఢీకొని 10 గొర్రెలు మృతి చెందిన సంఘటన సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి పెట్రోల్ బంక్ వద్ద చోటుచేసుకుంది. గోదావరిఖని వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు టీఎస్ 02 యు సి 6346 గల ది వేగంగా వచ్చి రోడ్డు దాటుతున్న గొర్రెలను ఢీకొట్టడంతో పది గొర్రెలు మృతి చెందాయి.మరికొన్ని గొర్రెలు గాయాల పాలయ్యాయి.ఈ సందర్భంగా గొర్రెల కాపరి కూకట్ల రాజయ్య మాట్లాడుతూ గొర్రెలపై ఆధారపడి జీవిస్తున్నానని, చనిపోయిన గొర్రెలను చూసి కన్నీటి పర్యంతం అయ్యాడు. తనకు న్యాయం చేయాలని గొర్రెల కాపరి కూ కట్ల రాజయ్య సంబంధిత అధికారులను వేడుకొన్నారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ శ్రావణ్ కుమార్ సందర్శించి విచారణ అనంతరం కేసు నమోదు చేస్తామని తెలిపారు.



## జెడ్.పి.టి.సి, ఎం.పి.పి స్థానాలకు రిజర్వేషన్ల ఖరారు
### నిజామాబాద్ జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి వెల్లడి

**నిజామాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని జెడ్.పి.టి.సి, ఎం పి.పి స్థానాలకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరిస్తూ రిజర్వేషన్ లు ఖరారు చేయడం జరిగిందని నిజామాబాద్ జిల్లా కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్సు హాల్ లో అదనపు కలెక్టర్ అంకిత్, జెడ్పీ సీ.ఈ.ఓ సాయాగౌడ్, డిప్యూటీ సీ.ఈ.ఓ సాయన్నలతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో రిజర్వేషన్ల కేటాయింపు ప్రక్రియ నిర్వహించారు. జిల్లాలోని 31 జెడ్.పి.టి.సి, ఎం పి.పి స్థానాల కోసం ఎస్.సి, ఎస్.టి, బి.సి, జనరల్ రిజర్వేషన్లను వీడియో రికార్డింగ్ మధ్యన, నిబంధనలను అనుసరిస్తూ పూర్తి పారదర్శకంగా రిజర్వేషన్లు ఖరారు చేశారు. 2011 జనాభా ప్రాతిపదికన ఎస్.సి, ఎస్.టి రిజర్వేషన్లు, బీ.సీ డెడికేషన్ కమిషన్ నివేదికను అనుసరిస్తూ, రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచనలకు అనుగుణంగా బి.సి రిజర్వేషన్ కేటాయింపులు చేశామని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలోని మొత్తం 31 జెడ్.పి.టి.సి స్థానాలకు గాను ఎస్.టిలకు 3



స్థానాలు రిజర్వ్ అయ్యాయని, అందులో ఒకటి మహిళకు రిజర్వ్ అయ్యిందని కలెక్టర్ తెలిపారు. ఎస్.సి లకు 5 జెడ్.పీ.టీ.సి స్థానాలు రిజర్వ్ కాగా, మహిళలకు 2 స్థానాలు కేటాయించబడ్డాయని అన్నారు. బీ.సి లకు 13 స్థానాలు రిజర్వ్ కాగా, వీటిలో 6 స్థానాలు మహిళలకు కేటాయించబడినాయని తెలిపారు. మిగతా 10 మండలాలు జనరల్ కేటగిరిలో ఉండగా, వీటిలో 5 స్థానాలు మహిళలకు కేటాయించడం జరిగిందని వివరించారు. అదేవిధంగా జిల్లాలోని 31 ఎం.పీ.పీ స్థానాలకు గాను ఎస్.టిలకు 3 స్థానాలు రిజర్వ్ అయ్యాయని, అందులో ఒకటి మహిళకు రిజర్వ్ అయ్యిందని కలెక్టర్ తెలిపారు. ఎస్.సి లకు 5 ఎం.పీ.పీ స్థానాలు రిజర్వ్ కాగా, మహిళలకు 2 స్థానాలు కేటాయించబడ్డాయని అన్నారు. బీ.సి లకు 13 స్థానాలు రిజర్వ్ కాగా వీటిలో 6 స్థానాలు మహిళలకు కేటాయించబడినాయని తెలిపారు. మిగతా 10 మండలాలు జనరల్ కేటగిరిలో ఉండగా, వీటిలో 5 స్థానాలు మహిళలకు కేటాయించడం జరిగిందని కలెక్టర్ వెల్లడించారు. ఖరారైన రిజర్వేషన్ల వివరాలను ప్రభుత్వానికి, ఎన్నికల కమిషన్ కు నివేదించడం జరుగుతుందని తెలిపారు.

## తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ప్రధాత కొండా లక్ష్మణ్ బాపూజీ

### పద్మశాలి సేవ సంఘం అధ్యక్షుడు చక్రపాణి



**యైటింక్లయిన్ కాలని సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** తెలంగాణ తొలి, మలి ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ స్ఫూర్తితోనే తెలంగాణ ఉద్యమాన్ని కొనసాగించి, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని 8వ కాలని పద్మశాలి సేవ సంఘం అధ్యక్షుడు దేవనపల్లి చక్రపాణి అన్నారు. శనివారం కొండా లక్ష్మణ్ బాపూజీ 110వ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1969 తెలంగాణ ఉద్యమ కాలంలో కొండా లక్ష్మణ్ బాపూజీ తన పదవికి రాజీనామా చేసి, తెలంగాణ తొలి, మలి ఉద్యమాల్లో పాల్గొన్న మహానేత కొండా లక్ష్మణ్ బాపూజీ అని అభివర్ణించారు. లక్ష్మణ్ బాపూజీ ఆశయాలకు అనుగుణంగానే రాష్ట్రంలో పరిపాలన సాగుతుందన్నారు. ఆనాడు తెలంగాణ ఉద్యమ కాలంలో బాపూజీ ఇచ్చిన స్ఫూర్తితోనే మలి ఉద్యమకాలంలో యువత, సబ్బండ వర్గాల వారు చురుకుగా పాల్గొన్నారన్నారు. కొండబాపూజీ తెలంగాణ జాతిపితయని, స్వాతంత్ర&య సమరయోధుడని, బలహీన వర్గాల స్ఫూర్తి ప్రధాతయని కొనియడారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి సాంబారి రాజేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ కుర్మ శ్రీనివాస్, గుండేటి ప్రభాకర్, దుబ్బ కుమారస్వామి, మెరుగు రాజేశం, సత్యనారాయణ సంపత్ కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

## మీడియాషన్ కేంద్రాల ఏర్పాటు శుభపరిణామం

### టిపిసిసి డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్ రావు



**మెట్ పల్లి, సెప్టెంబర్ 27,(జనం సాక్షి)**ప్రజలకు సత్వర న్యాయం జరగాల్సిన సమయంలో మీడియాషన్ కేంద్రాల ఏర్పాటు శుభపరిణామం అని టిపిసిసి డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్ రావు అన్నారు. ఇటీవల మెట్ పల్లి కోర్టు నుండి మీడియాషన్ శిక్షణ పూర్తిచేసుకున్న న్యాయవాదులు ఒజ్జెల శ్రీనివాస్, బక్కూరి రమేష్, తునికి వేణు గోపాల్, పసునూరి శ్రీనివాస్ లను ఈ సందర్భంగా ఆయన సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కక్షిదారుల మధ్య రాజీ కోసం ప్రత్యేక చట్టాలు తీసుకురావడం అభినందనీయం అన్నారు. మధ్యవర్తిత్వ కేంద్రాలతో కక్షిదారులకు ఉపయోగం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం లో న్యాయవాదులు మార్క వంశీకృష్ణ, ఉడుత ప్రశాంత్ మహర్షి, మెట్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, కిషన్ సెల్ రాష్ట్ర కో ఆర్డినేటర్ వాకిడి సత్యం రెడ్డి, మాజీ పట్టణ అధ్యక్షులు యండి కుత్బుద్దీన్ పాషా, ఫిషర్ మెన్ కమిటీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ రుత్త నారాయణ, మాజీ ఎంపిటీసి సింగరపు అశోక్, ఫిషర్ మెన్ ఉమ్మడి జిల్లా డైరెక్టర్ కల్లెడ గంగాధర్ లు ఉన్నారు.

## శ్రీ మార్కండేయ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో

### కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు



**రాయికల్ సెప్టెంబర్ 27(జనం సాక్షి):**రాయికల్ మండలం, అల్లీపూర్ గ్రామంలో మార్కండేయ పద్మశాలి సేవా సంఘం సొంత భవనంలో శనివారం రోజున కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు ఈ కార్యక్రమంలో కుల పెద్దలు అందరూ వచ్చి కొండా లక్ష్మణ్ బాపూజీకి పూలమాల అలంకరించి కొబ్బరికాయ కొట్టి ఘన నివాళులు స్మరించుకోవడం జరిగిందిఈ సందర్భంగా కుల సంఘ సభ్యులు మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ 1915 సెప్టెంబర్ 27 కొమరం భీం జిల్లా వాకండి గ్రామంలో జన్మించాడు. స్వాతంత్ర ఉద్యమంలో నిరంకుశ నిజాం వ్యతిరేక తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నాడు. 1952లో శాసనసభ్యుడుగా ఎన్నికయ్యాడు. 1969లో తన మంత్రి పదవిని కూడా తృణప్రాయంగా వదిలేసిన నిబద్ధత కలిగిన రాజకీయవేత్త. 2009- 2012లో తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నాడు .తెలంగాణ ఉద్యమ సమయంలో నిరాహార దీక్ష చేసిన ఏకైకవ్యక్తి ముద్దుబిడ్డ పద్మశాలి కొండ లక్ష్మణ్ బాపూజీ. రాష్ట్ర చేనేత సహకార రంగానికి కృషి చేశాడు అని సంఘ సభ్యులు మాట్లాడడం జరిగింది ఈ కార్యక్రమంలో పద్మశాలి ఉపాధ్యక్షులు పోతు సత్యం ప్రధాన కార్యదర్శి మిట్టపెల్లి రాజేందర్, కోశాధికారి తదితరులు కుల బంధువులు పాల్గొన్నారు.

## లాభాల వాటా చెల్లింపు ప్రకటనపై సీఎంకి కోల్ బెల్టు మంత్రులకు ధన్యవాదాలు



### ఐఎన్టియుసి కేంద్ర కార్యదర్శి గడ్డం తిరుపతి యాదవ్

### ఓసీపీ-1లో సీఎం, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకాలు

**యైటింక్లయిన్ కాలనీ సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** గత సంవత్సరం సింగరేణి సంస్థ ఆర్జించిన లాభాలలో ఇటీవల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాదులో సమావేశం నిర్వహించి సంస్థ పర్మినెంట్ కార్మికులకు 34శాతం వాటా, అలాగే కాంట్రాక్టు కార్మికులకు 5500 బోనస్ ప్రకటించిన నేపథ్యంలో చెల్లింపు తేదీని ప్రకటించాలని ఐఎన్టియుసి సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ ఒత్తిడి మేరకు ఈ సోమవారం 29న చెల్లించుటకు ఆదేశాలు జారీ చేశారు. శనివారం సింగరేణి ఆర్జీ-3 ఓసిపీ-1 కార్మికులు సంబరాలతో లాభాల వాటా ప్రకటనకు కృషిచేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి, కోల్ బెల్టు ఏరియా మంత్రులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ లతోపాటు లాభాలా వాటా ప్రకటించిన సందర్భంగా వారి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఐఎన్టియుసి కేంద్ర కార్యదర్శి గడ్డం తిరుపతి యాదవ్ మాట్లాడుతూ సింగరేణి కార్మికుల సమస్యలపై ఐఎన్టియుసి సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వంతో ప్రత్యేక చొరవతో సంప్రదింపులు, సంస్థ అధినేతలతో సమావేశాల ఒత్తిడి మేరకే ఈ లాభాల వాటా ప్రకటన జరిగిందన్నారు. దసరా పండుగ తర్వాత మిగతా సింగరేణి సమస్యలపై మరింత ప్రత్యేక చొరవతో పరిష్కరించ నున్నట్లు తెలిపారు, వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టియుసి నాయకులు గునిగంటి వెంకట స్వామి, సయ్యద్ సలీం, కొండల్ రెడ్డి, జంజర్ల తిరుపతి, తోకల ప్రవీణ్ రెడ్డి, సతీష్, సంపత్, రమేష్ రావు, తిరుమలేష్, చంద్రశేఖర్, మధుకర్, నాగరాజు, రవికుమార్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గామాత మండపాలను దర్శించుకున్న మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఎస్ఎస్ అన్వర్



**మంథని, (జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ కేంద్రంలోని శ్రీ దేవి శరన్నవరాత్రుల సందర్భంగా కమాన్పూర్ లోని చత్రపతి శివాజీ యువసేన, శ్రీ వేణుగోపాల స్వామి, కిష్టంపల్లి హనుమాన్ టెంపుల్, బాపూజీ నగర్ లో ఏర్పాటు చేసిన శ్రీ దుర్గాదేవి అమ్మవారి మండపం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. లోక మాత అయినటువంటి శ్రీ దుర్గా మాత ఆశీస్సులు కమాన్ పూర్ ప్రజలపై ఎల్లప్పుడు ఉండాలని, సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో జీవించాలని, సకాలంలో వర్షాలు కురిసి రైతులకు అధిక దిగుబడులు రావాలని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం వేద పండితులచే ఆశీర్వచనం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ ఇనుగంటి భాస్కరరావు, కాంగ్రెస్ నాయకులు ఇనగంటి రామారావు, అంబీర్ శ్రీనివాస్, పిన్ రెడ్డి కిషన్ రెడ్డి, రంగు సత్యనారాయణ, బొల్లపెల్లి శంకర్,అనవేని లక్ష్మీరాజం, మల్యాల తిరుపతి, మల్యాల మహేష్, నగునూరి నరసయ్య, ముస్తాక్, బొజ్జ సాగర్, బొంపెల్లి మల్లేష్, కుక్క రవి,వెంగళి రాజయ్య, సజ్జనపు శోక్కయ్య, చాట్ల రాజమల్లు, చాట్ల గట్టయ్య, జంగపెల్లి రవి, తిరుపతి, కమ్మగోని అనిల్, కాల్వల ప్రకాష్, గెల్లు లింగయ్య, తదితరులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

## ఘనంగా ఆచార్య శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ గారి జయంతి వేడుకలు



**రాయికల్ సెప్టెంబర్ 27(జనం సాక్షి):**పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా బాపూజీ విగ్రహనికి పూలమాలలు వేసి ఘనంగా జయంతి వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీ మోర హనుమాన్లు గారు మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ మారుమూల గ్రామంలో పుట్టి అంచెలంచలుగా ఎదిగి రాజకీయాలలో అత్యున్నత పదవులను అందుకున్నారని తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించడమే కాకుండా ఉద్యమ సమయం లో వారి సొంత ఆస్తులను కూడా ఉద్యమానికి అందించారని పద్మశాలి ముద్దు బిడ్డగా ఆ మహానుభావుడి అడుగుజాడల్లో నడవాలని బాపూజీ భావజాలంలో భాగంగా సంఘటితం ఐకమత్యమే లక్ష్యంగా ముందు ముందు పద్మశాలి బిడ్డలు రాజకీయంగా సమాజంలో ఉన్నత పదవులను అందుకోవాలని సందేశం అందించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు భోగ రాజేశం, ఉపాధ్యక్షులు దాసరి గంగాధర్ , ప్రధాన కార్యదర్శి కడకుంట నరేష్, కోశాధికారి ఆడెపు నరసయ్య, యువజన సంఘం అధ్యక్షులు సామల సతీష్, ప్రధాన కార్యదర్శి ఆడేపురాజీవ్, ఉపాధ్యక్షులు సింగని సతీష్, కార్యదర్శి అనుమల్ల చంద్రతేజ, పోపా సంఘం అధ్యక్షులు దాసరి రామస్వామి, ఉపాధ్యక్షులు మాచర్ల స్వప్న, కోశాధికారి దాసరి కృష్ణ హరి, అష్టమవాడ పెద్దలు గూడూరు పొట్టయ్య, శ్రీరాముల వెంకటస్వామి, సామల సత్యనారాయణ, జిల్లా సంఘం కోశాధికారి తుమ్మ రాజేశం, మాజీ అధ్యక్షులు తాటిపాముల విశ్వనాథం, గాజెంగి అశోక్,మేకల కాంతారావు, బొమ్మకంటి రాం గోపాల్, హనుమాన్ దేవాలయ చైర్మన్ దాసరి గంగాధర్, మచ్చ శేఖర్, గుట్ట సత్యనారాయణ, శ్రీపతి లక్ష్మీనారాయణ, దేవనపల్లి సురేందర్, అష్టమ వాడ పెద్దలు,సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న తహసీల్దార్ నాగార్జున



**రాయికల్ సెప్టెంబర్ 27(జనం సాక్షి)!**మండలంలోని మహితాపూర్ శ్రీగిరి పర్వతంపై కొలువుదీరిన కనకదుర్గాదేవి అమ్మవారిని తహసీల్దార్ నాగార్జున, ఆర్ఐ పద్మయ్య, దేవదాస్ శనివారం దర్శిం చుకున్నారు. ఆలయ అర్చకులు క్యాషనూరి జగదీశ్వర్ ప్రత్యేక అర్చన నిర్వహించి అమ్మవారి చిత్రాన్ని బహుకరించారు. అనంతరం ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు శాలువా కప్పి తహసీల్దార్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు రాజనాల మధు కుమార్, ఉపాధ్యక్షులు వంగమల్లయ్య, ప్రధాన కార్యదర్శి శివనీతి అమరేందర్, కోశాధికారి నాగిరెడ్డి రఘుపతి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 28 (జనం సాక్షి)**శనివారం జిల్లా కేంద్రంలోని సి ఎస్ ఐ చర్చి ఎదురుగా గల కొండ లక్మణ్ బాపూజీ విగ్రహం వద్ద బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొండ లక్మణ్ బాపూజీ జయంతి ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ కొండ లక్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొండ లక్మణ్ బాపూజీ నిజాం నిరంకుశ విధానానికి వ్యతిరేకంగా ఉద్యమించిన మహనీయ నేత అని అన్నారు. తెలంగాణ తొలి,మలిదశ ఉద్యమంలో చురుగ్గా పాల్గొని తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో ముఖ్య భూమిక పోషించారని అని ముఖ్య భూమిక పోషించారని అన్నారు. ఆయన చూపిన పోరాటపటిమ నేటితనానికి ఆదర్శనీయమని అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జయరాజ్, సహాయ బీసీ అభివృద్ధి అధికారి చక్రధర్, బహుజన సంఘాల నాయకులు కొత్తపల్లి మల్లయ్య, రాజయ్య, నాగరాజు, ఆజాద్, వినోద్, పవన్, జీవన్, శాంతయ్య, నరేష్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు వెంకటరెడ్డి, కార్యదర్శి నాగరాజు, బీసీ సంఘం నాయకులు, పద్మశాలి సంఘం నాయకులు షేర్ల రాములు, లక్ష్మి నర్సింలు, చాట్ల రాజేశ్వర్, సబ్బాని హరి, అవధూత నరేందర్ జిల్లా అధికారులు మరియు పలువురు ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి

### ఎంపీడీఓ కార్యాలయం ముందు నిరసన



**నిజాంసాగర్ సెప్టెంబర్ 27(జనంసాక్షి)**ప్రభుత్వం స్పందించి తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలనీ ఓ వ్యక్తి నిజాంసాగర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయం ముందు అర్ధ నగ్నంగా ధర్నాకు కూర్చున్నాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం నిజాంసాగర్ మండలం లోని వెల్గనూర్ గ్రామానికి చెందిన కొక్కుల సంతోష్ కొక్కుల మొగులవ్వ వెల్గనూర్ గ్రామంలో ఇల్లు నిర్మాణం చేసారు. వీరి పేరు ఇందిరమ్మ ఇళ్ల లిస్టు లో రాలేదు అయితే తాము ఇంటి నిర్మాణం కొరకు అప్పు చేసి ఇంటి నిర్మాణం చేపట్టమని వాపోయారు. తమకు ఇందిరమ్మ ఇళ్ల లిస్టులో చేర్చి బిల్లు మంజూరు చేయాలనీ శనివారం నాడు ఎంపీడీఓ కార్యాలయం ముందు కుటుంబ సభ్యులతో ధర్నా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ ఘటన పై గ్రామ పంచాయతీ కార్యదర్శి గంగ సాగర్ ను జనంసాక్షి వివరణ కోరగా వారు ఇంటినిర్మాణం ముందుగానే చేసారని దీని కారణంగా ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు సంబందించిన ఫోటోలు అప్ లోడు కావడం లేదని వివరించారు. ముందే నిర్మించి నందున బిల్లు మంజూరు కావడం లేదున్నారు.

## ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి



**నిజామాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 27 (జనం సాక్షి) :**తెలంగాణ వాది, స్వాతంత్ర పోరాట యోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకను శనివారం ఘనంగా నిర్వహించారు. వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా ఈ ఉత్సవాలు జరిపారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ అంకిత్, పద్మశాలి, బీసీ, ఎస్సీ కుల సంఘాల ప్రతినిధులు, తదితరులు వినాయకనగర్ లోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం న్యూ అంబేద్కర్ భవన్ లో నిర్వహించిన జయంతి కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తుది శ్వాస వరకు అంకితభావం, నిజాయితీగా కృషి చేసిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని ప్రశంసించారు. కేవలం తెలంగాణ ఉద్యమంలోనే కాకుండా దేశ స్వాతంత్ర్య పోరాటంలోనూ పాల్గొన్నారని, చట్టసభల్లో గళమెత్తి తన పదవులను తృణప్రాయంగా వదులుకున్న త్యాగశీలి అని గుర్తు చేశారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాల సాధనకు అందరూ పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి నర్సయ్య, పద్మశాలి, బీస, ఎస్సీ కుల సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## వరికి బోనస్‌ను చెల్లించాలి

### జైతాపూర్ మహాజన సభలో తీర్మానం



**ఎడపల్లి, సెప్టెంబర్ 27 ( జనంసాక్షి ) :** వరికి బోనస్ ను చెల్లించాలని జైతాపూర్ మహాజన సభలో సభ్యులు రైతులు తీర్మానించారు. శనివారం ఎడపల్లి మండలం జైతాపూర్ సహకార సంఘం మహాజన సభను అధ్యక్షులు కరటూరి సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, రైతులకు సరిపడా యూరియాను ఇతర ఎరువులను సకాలంలో అందించడం జరిగిందన్నారు. అయితే ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఎరువుల విక్రయం ఉంటుందని ఈ విషయాన్ని రైతులు గమనించాలని ఆయన స్పష్టం చేశారు. అనంతరం రైతులు, సభ్యులు వరికి బోనస్ ను చెల్లించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ కరటూరి సత్యనారాయణ, కార్యదర్శి సీహెచ్ రాజశేఖర్, వైస్ చైర్మన్ టీ శ్రీనివాస్ గౌడ్, సభ్యులు బిక్కిని విజయ్ కుమార్, ఖాజా తాహెర్ అలీ, దామోదర్, దత్తు, నడ్పి సాయిలు, ఎ రాజా రెడ్డి, లక్ష్మణ్, సిబ్బంది ఎ సాయి తేజ, జంలం యాదగిరి, గణేష్, రైతులు పాల్గొన్నారు.

## రైతుల హక్కుల కోసం బి కే ఎస్ ఉద్యమం



**జగిత్యాల బ్యూరో సెప్టెంబర్ 27 ( జనం సాక్షి)** భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం శనివారం హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించారు. ఈ సమావేశానికి జగిత్యాల జిల్లా బికేఎస్ జిల్లా కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర రైతంగం ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు, భారతీయ కిసాన్ సాంగ్ గ్రామస్థాయిలో బోలోపేతంపై ఈ సందర్భంగా చర్చించారు పార్టీలు వేరైనా రైతులంతా ఒకటే అని నినాదం తోరైతుల హక్కుల కోసం ఉద్యమించాలని సూచించారు ఈ కార్యక్రమంలోజిల్లా అధ్యక్షులు కాసారం భూమారెడ్డి,ప్రధాన కార్యదర్శి ఇప్ప రాజేందర్, కసిడి లక్ష్మారెడ్డి,రావుల లింగారెడ్డి, సత్యనారాయణ,జిల్లా ఉపాధ్యక్షులు నోముల నరసింహారెడ్డి,ముద్దాం గంగారెడ్డి,చల్ల సురేందర్,మిట్టపల్లి తిరుపతిరెడ్డి,కట్ట రవీందర్,కుసరి ప్రభాకర్,కర్బూజా శేఖర్, మాధవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మోత్కులగూడెం గ్రామంలో అంగరంగ వైభవంగా కుంకుమ పూజా కార్యక్రమం



**జమ్మికుంట,సెప్టెంబర్ (జనం సాక్షి):** జమ్మికుంట పట్టణంలోని మోత్కులగూడెం గ్రామంలో శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయంలో దుర్గామాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మొట్ట మొదటిసారిగా దుర్గామాతను ప్రతిష్టించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ శ్రీదేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం రోజున కుంకుమ పూజ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించామన్నారు. కుంకుమ పూజ కార్యక్రమం అనంతరం మాలధార చేసిన భవానీలకు కుంకుమ పూజలో పాల్గొన్నటువంటి భక్తులకు పెద్ద ఎత్తున అన్న ప్రసాద వితరణ జరిపామన్నారు. ఈ కార్యక్రమం దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## స్నేహితుని కుటుంబానికి చేయూత

**ముస్తాబాద్ సెప్టెంబర్ 27 (జనం సాక్షి):** కష్టకాలంలో ఉన్న మిత్రుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేత ఆపదలో ఉన్న చిన్ననాటి స్నేహితుల కుటుంబాలకు పదవ తరగతి బ్యాచ్ స్నేహితులు వారి కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేసి అండగా నిలిచారు. ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన బాలకృష్ణ అనే వ్యక్తి అనారోగ్యంతో నెలరోజుల క్రితం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న చిన్ననాటి మిత్రులు పదవ తరగతి వాట్సాప్ గ్రూప్ లో ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించుకున్నారు. గతంలో మృతి చెందిన తమ మిత్రుల కుటుంబాలకు కూడా సహాయం అందించారు. బాలకృష్ణ కుటుంబానికి రూ 14,500, మధుసూదన్, రాజు, మల్లేశం కుటుంబాలకు ఒక్కొక్కరికి 2,000 చొప్పున మిత్రులందరి సహకారంతో కడమంచి రవి,కొల్లూరి నాగరాజు బాధిత కుటుంబాలకు అందించారు. భవిష్యత్తులోనూ ఎలాంటి ఆపద వచ్చిన ఆదుకునేందుకు తమ మిత్రులందరు అండగా ఉంటామని తెలిపారు.కుమారులు దూరమై పుట్టెడు దుఃఖంలో కుటుంబాలకు. కుమా రుల్లాగా పండగ పూట సహాయం అందించినందుకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## నాగేపల్లిలో అభివృద్ధి పనులకు భూమి పూజ



మంథని, (జనంసాక్షి) : పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం నాగేపల్లి గ్రామంలో ఐటి శాఖ మినిస్టర్ దుద్దిళ్ల శ్రీధర్ బాబు మంజూరు చేయించినటువంటి అంగన్వాడీ సెంటర్స్, బిల్డింగ్స్, సీసీ రోడ్స్ ...కల్వర్ట్స్, స్కూల్ బిల్డింగ్.. రిపేర్స్, తదితర అభివృద్ధి పనుల కు శనివారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ స్పెషల్ ఆఫీసర్ పంచా యతీరాజ్ వరలక్ష్మి, గ్రామ కార్యదర్శి స్వప్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎల్లె రామ్మూర్తి, తీగల సమ్మయ్య, వేగోలపు శ్రీనివాస్ , ఎరుకల బాపురావు , వేగోలపు అంజయ్య, పొన్నం తిరుపతి, వేగోలపు రాయమల్లు, సట్ల రాజు కుమార్, తీగల సదయ్య, వేగోలపు సంతోష్, నాడెం శ్రీనివాస్, వేగోలపు రవి, వేగోలపు అశోక్ , భద్రయ్య ,బాద్రపు శ్రీనివాస్ యాసం , సంకే సదానందం,తొట్ల సదానందం తదితరులు పాల్గొన్నారు.

## ఖరారైన రుద్రంగి మండల గ్రామపంచాయతీ వార్డుల రిజర్వేషన్స్



**రుద్రంగి సెప్టెంబర్ 27 (జనం సాక్షి )**రుద్రంగి మండల గ్రామ పంచాయతీ వార్డుల రిజర్వేషన్ ఖరారైంది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీడీవో నటరాజన్ మం డల గ్రామ పంచాయతీ వార్డు ల రిజర్వేషన్ ప్రక్రియ డ్రా పద్ధతి ద్వారా ఖరారు చేశారు. రుద్రంగి గ్రామ మరియు మానాల గ్రామ వార్డుల రిజర్వేషన్ ను స్థానిక నాయకులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. రుద్రంగి గ్రామపంచాయతీ 16 వార్డులకు గాను జనరల్ 3 ,బీసీ జనరల్ 3, బిసి ఉమెన్ 4, ఎస్సీ జనరల్ 1, ఎస్సి ఉమెన్ 1, ఎస్టీ జనరల్ 1 అన్ రిజర్వ్డ్ ఉమెన్ 3 లుగా ఎన్నిక చేశారు. అలాగే మానాల గ్రామ పంచాయతీల 14 వార్డులకు గాను బీసీ జనరల్ 3, బీసీ ఉమెన్ 3, ఎస్సీ ఉమెన్ 1, ఎస్టి ఉమెన్ 1, ఎస్టీ జనరల్ 1, జనరల్ ఉమెన్ 2, జనరల్ 3 లుగా రిజర్వేషన్ ఎన్నికల చేశారు. మిగతా 8 తండా గ్రామపంచాయతీ లలో ఇంతకుముందు ఉన్న రిజర్వేషన్ ఎస్టీ స్త్రీ గాను ఎస్టి పురుషులుగా మారిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ తో పాటు అన్ని పార్టీల నాయకులు తదితరులు ఉన్నారు.

## బతుకమ్మ పాట వీడియోను ఆవిష్కరించిన వైద్యులు సత్యనారాయణ స్వామి




ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 27, (జనంసాక్షి) : భువన్ ఆర్ట్స్ మ్యూజిక్ యూట్యూబ్ చానల్ వారి ఆధ్వర్యంలో నిర్మించిన అందాల పూలతో బతుకమ్మ పాట 2025 వీడియోను శనివారం ఎల్లారెడ్డిపేట మండల అశ్విని హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ జి. సత్యనారాయణ స్వామి, డాక్టర్ అభినయ్‌లు ఆవిష్కరించారు. ఈ బతుకమ్మ పాటకు నిర్మాతలు పొందుర్తి లవన్‌తారక్, ఒగ్గు రజిత బాలరాజుయాదవ్‌లు నిర్మించారు. డైరెక్టర్, కొరియోగ్రాఫర్‌గా ఉమేష్ ఈ పాటను చిత్రీకరించారు. తెలంగాణ సాంస్కృతి ఉట్టిపడేలా బతుకమ్మ పాట చిత్రీకరణ ఉందని ఈ పాటను చిత్రీకరించిన వారందరిని అసుపత్రి వైద్యులు ప్రత్యేకంగా అభినందించారు. బతుకమ్మ పాట చిత్రీకరణలో పాల్గొన్న మహిళలు, విద్యార్థులు, బతుకమ్మ పాట డైరెక్టర్, కొరియోగ్రాఫర్ కావ్య– ఉమేష్ దంపతులు అశ్విని ఆసుపత్రి వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పాట ఆవిష్కరణ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి చీటి లక్ష్మణ్‌రావు, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వంగ గిరిధర్‌రెడ్డి, శ్రీవేణుగోపాల స్వామి ఆలయ కమిటి వైస్ చైర్మన్ గంట వెంకటేష్‌గౌడ్, పందిర్ల లింగంగౌడ్‌లు పాల్గొన్నారు.

## ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు



మెట్ పల్లి, సెప్టెంబర్ 27,(జనం సాక్షి)మెట్‌పల్లిలో పట్టణంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా వారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం జీవితాంతం కష్టపడి పోరాడిన మహనీయుడు బాపూజని అందుకే ఆయనను తెలంగాణ తండ్రి అని గౌరవంగా పిలుస్తారని తెలిపారు.ప్రజల కోసం పదవులు, పదవీ ప్రలోభాలను త్యజించి, తన సంపూర్ణ జీవితం సమాజ సేవకే అంకితం చేశారని గుర్తు చేశారు.ఆయన 1969 లో జరిగిన తెలంగాణ ఉద్యమానికి పునాది వేసి, ఆ తరువాతి తరాలకు స్ఫూర్తి నిచ్చిన మహోన్నత నాయకుడని పేదల కోసం, రైతుల కోసం, వెనుకబడిన వర్గాల కోసం ఎల్లప్పుడూ పోరాడిన ఆచార్య బాపూజీ జీవితమే త్యాగానికి ప్రతీక అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.యువత బాపూజీ ఆలోచనలు,పోరాట స్ఫూర్తి, ఆయన చూపిన మార్గాన్ని అనుసరిస్తేనే తెలంగాణ నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని పిలుపునిచ్చారు.ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు ఆయన సేవలు, త్యాగాలు తెలంగాణ చరిత్రలో ఎప్పటికీ చిరస్థాయిగా నిలుస్తాయని తెలిపారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయం బీసీలకు 42% రిజర్వేషన్లు హర్షణీయం: జిల్లా కాంగ్రెస్ నాయకులు నాగరాజ్ గౌడ్



కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 27 (జనం సాక్షి)రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలలో బిసి లకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించి జీవో జారీ చేయడం పట్ల జిల్లా కాంగ్రెస్ నాయకులు అంకన్నగారి నాగరాజ్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42% రిజర్వేషన్లు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం ప్రజా పాలనకు నిదర్శన మన్నారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం బీసీల పట్ల వారిని రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాలలో అభివృద్ధి చేయాలన్న సంకల్పం రిజర్వేషన్లతో నెరవేరనుం దన్నారు.అగ్రవర్ణమైన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి వర్గం బిసి రిజర్వేషన్లు అమలు కోసం అహర్నిశలు కృషి చేసారన్నారు. లోకసభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఇచ్చిన మాట తెలంగాణ లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో అమలు చేసేందుకు కృషి చేసిందన్నారు రాజకీయ, సాంకేతిక, న్యాయ పరమైన, రాజ్యాంగ పరమైన అన్ని రకాల చర్యలు తీసుకొని ఇప్పుడు జీవో ఇచ్చిందన్నారు.దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో పకడ్బందీగా కులగణన చేపట్టి బీసీ కమిషన్ వేసి అన్ని రకాలుగా సాంకేతికంగా సమాచారాన్ని సేకరించి రిజర్వేషన్లు అమలు చేసేందుకు జీవో ఇచ్చి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట నిలబెట్టుకుందన్నారు.బిసి సమాజం పక్షాన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రి వర్గానికి, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీకి, టీ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు

# సైదాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ

### రికార్డులు పరిశీలన



సైదాపూర్ సెప్టెంబర్ 27 (జనం సాక్షి) మొదటి కాన్పులను సిజేరియన్ చేయించుకోవడం వల్ల కలిగే సమస్యలను వివరించి సాధారణ డెలివరీల కొరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో జరిగేటట్లుగా గర్భవతులను, వారి కుటుంబ సభ్యులను ప్రోత్సహించాలని డిఎంహెచ్ఓ వెంకటరమణ వైద్య సిబ్బందిని ఆదేశించారు. సైదాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ చందుతో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. హాజరు పట్టికను, అవుట్ పేషెంట్ రిజిస్టరు లను ఇతర రికార్డులను వెరిఫై చేశారు. ఎన్ సి డి క్లినిక్ లో అసంక్రమిత వ్యాధుల రికార్డులను పరిశీలించారు . ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన పేషంట్లతో మాట్లాడుతూ ఇక్కడ వారికి అందుతున్న సేవలు గురించి ఆరా తీస్తూ అధిక రక్తపోటు, షుగర్ వ్యాధికి సంబంధించిన మందులను అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోను మరియు ప్రభుత్వ ఆసుపత్రులలోని ఉచితంగా ఇస్తున్న వాటిని వాడుకొని ఖర్చులు తగ్గించుకోవాలన్నారు. ఫార్మసీ స్టోర్స్ లో సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందుల నిల్వలను పరిశీలించారు. ఆరోగ్య మహిళ హెల్త్ క్యాంపులలో స్క్రీనింగ్ జరిగిన మహిళలను రీస్క్రీనింగ్ పూర్తి చేయాలన్నారు. ప్రసూతి గది పరిశుభ్రతలను పరిశీలించి అందులో ఉండాల్సిన అత్యవసర మందుల పరిశీలించారు. మొదటి కాన్పులను సిజేరియన్ చేయించుకోవడం వల్ల కలిగే సమస్యలను వివరించి సాధారణ డెలివరీల కొరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో జరిగేటట్లుగా గర్భవతులను, వారి కుటుంబ సభ్యులను ప్రోత్సహించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిశుభ్రతను పరిశీలించి అన్ని వేళల క్లీన్ గా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి హుజురాబాద్ డాక్టర్ చందు, కేశపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టరు శ్రావణ్ కుమార్, సంబంధిత వైద్యులు, స్టాఫ్ పాల్గొన్నారు.

## రాజకీయాల్లో యువత అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం




ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 27, (జనంసాక్షి) : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సాయి మణికంఠ గార్డెన్స్‌లో శనివారం న్యాయవాది కొండాపురం వెంకట్‌రెడ్డి, మారావేని రంజిత్ ఆధ్వర్యంలో రాజకీయాల్లో యువత అనే అంశం పై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. న్యాయవాది వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ నేటి రాజకీయాల్లో యువకులు ముందుకురావలని, యువత ద్వారానే గ్రామాల, మండలాల, జిల్లాల, రాష్ట్రాల, దేశ భవిష్యత్తు ఉందని వెంకట్‌రెడ్డి యువకులకు సూచించారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని రాజకీయ పార్టీల నుండి యువ నాయకులు, పార్టీలకు అతీతంగా రాజకీయాల పట్ల ఆసక్తి ఉన్నటువంటి యువ నాయకులు పాల్గొన్నారు. యువ నాయకులు రౌండ్ టేబుల్ సమావేశంలో వారి వారి అభిప్రాయాలను వ్యక్తం చేశారు. యూత్ ఇన్ పాలిటిక్స్ ముఖ్య ఉద్దేశాన్ని, భవిష్యత్తు రాజకీయాల్లో యువత పాత్ర ఏవిధంగా ఉండబోతుందని బుర్రం రవితేజ గౌడ, నరేష్ నాయక్‌లు వివరించారు. ఈ కార్యక్రమంలో యువనాయకులు బానోతు తిరుపతినాయక్, సింగారం దేవరాజు, ప్రమోద్, కల్ల మధు, బి. ప్రవీణ్, లంబ కుమార్, చిందు శ్రీనివాస్, సాయితేజ, జితేందర్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, బత్తుల అరవింద్, బేతి రాము, క్రాంతికుమార్, శేఖర్, రాజరెడ్డి, చరణ్‌గౌడ్, సాయిప్రేమ్, ఎల్లం యాదవ్, కొండ సాయి, పొన్నాల వెంకటేష్, ముత్యాల దీపక్, వివిధ పార్టీల నాయకులు, యువకులు పాల్గొన్నారు.

# ఘనంగా కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు




### మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్..

జమ్మికుంట,సెప్టెంబర్ 27 (జనం సాక్షి) : తెలంగాణ మలిదశ ఉద్యమంలో అలుపెరగని పోరాటం చేసిన వ్యక్తులలో కొండ లక్ష్మణ్ బాపూజీ ప్రముఖుడని, ఆయన ఆశయాలను అందరూ కడదాక కొనసాగించాలని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ అన్నారు.శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మున్సిపాలిటీ కార్యాలయంలో ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలవేసి జయంతి వేడుకలను కమిషనర్ మహమ్మద్ అయాజ్ అధ్యక్షతన మున్సిపల్ సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మహమ్మద్ అయాజ్ మాట్లాడుతూ ఆనాడు నిజాం నిరంకుశ పాలనకు, బడుగు బలహీన వర్గాలపై జరుగుతున్న అత్యాచారాలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన మహోన్నతమైన వ్యక్తి కొండ లక్ష్మణ్ బాపూజీ అన్నారు. తెలంగాణ మలి దశ ఉద్యమంలో గాంధేయ మార్గంలో పోరాటం చేసిన వ్యక్తి లక్ష్మణ్ బాపూజీ అన్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో తన ఇంటిని సైతం త్యాగం చేసిన వ్యక్తి ఆయన అని కమిషనర్ అయాజ్ కొనియాడారు. తెలంగాణ వస్తే మన నీళ్ళు మనకు వస్తాయని, మన నిధులు మనకు వస్తాయని, మన యువతకు ఉద్యోగాలు లభించే అవకాశం ఉందని ఆయన చేసిన పోరాటం ఒక పునాది అని ఆయన తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ స్మారకంగా నేడు ఆర్టికల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశారన్నారు. ఆయన 1952లో శాసన సభ్యునిగా, రెండు పర్యాయాలు రాష్ట్ర మంత్రిగా, డిప్యూటీ స్పీకర్ గా పదవులు అధిరోహించారని, చివరకు రాష్ట్ర మంత్రిగా అవకాశం వచ్చిన తెలంగాణ ప్రత్యేక సాధన కోసం తృణప్రాయంగా లక్ష్మణ్ బాపూజీ వదులుకున్నాడని అన్నారు.నేటి యువత ఆయన చూపిన మార్గంలో,ఆయన ఆశయాలను కొనసింగించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జి రాజిరెడ్డి, ఏఈ వికాస్, జె. ఏ. వో రాజశేఖర్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్లు భాస్కర్, వాణి, శ్రీనివాస్, శానిటరీ ఇన్స్ పెక్టర్లు మహేష్, సదానందంలతో ఈఈ శ్రీకాంత్,వార్డ్ ఆఫీసర్లు పలువురు పాల్గొన్నారు.

# జయదుర్గాదేవి ఆలయంలో వైభవంగా చండీ హోమం



గోదావరిఖని, జనంసాక్షి :స్థానిక సింగరేణి జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియం సమీపంలోని దుర్గాదేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అత్యంత వైభవంగా చండీ హోమం నిర్వహించారు.మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ దంపతుల ఆధ్వర్యంలో హోమం అంగరంగ వైభవంగా చేపట్టారు.వేదపండితుల మంత్రోచ్ఛరణాల మధ్య ఉదయం నుండి మధ్యాహ్నం వరకు హోమం నిరాటంకంగా సాగింది. ప్రతి సంవత్సరం క్రమంతప్పకుండా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అదే విధంగా దేవాలయ దగ్గర ప్రతిష్టాపన రోజు చండీ హోమం కొప్పుల ఈశ్వర్ దంపతులు నిర్వహించడం ఆనవాయితీ. జిల్లా ప్రజలు సంపూర్ణ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో, అష్టఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఈ హోమం కార్యక్రమం తప్పకుండా చేపడుతున్నారు.37 ఏళ్లుగా ఉత్సవాలు: కొప్పుల ఈశ్వర్..37 సంవత్సరాలుగా గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలోని దుర్గాదేవి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తెలిపారు.అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని, రెండున్నర దశాబ్దాలు క్రితం ఇక్కడ ఆలయ నిర్మాణం చేసినట్టు ఈశ్వర్ పేర్కొన్నారు.అమ్మవారిని ప్రతిష్టాపన చేపట్టిన అప్పటి నుండి ప్రతి సంవత్సరం ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్టు వివరించారు.ఈ కార్యక్రమంలో రామగుం డం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, నాయకులు పెంట రాజేష్, నారాయణదాసు మారుతి, వడ్డేపల్లి శంకర్, చెల్పూరి సతీష్, జేవీ రాజు, వందలాది మంది అమ్మవారి భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# నగరపాలక సంస్థ కార్యాలయంలో కొండా లక్ష్మణ్‌బాపూజీ జయంతి వేడుకలు



గోదావరిఖని, జనంసాక్షి :కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి పురస్కరించుకుని నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అడిషనల్ కమీషనర్ మారుతీప్రసాద్, సూపరింటెండింగ్ ఇంజనీర్ గురువీర, ఇఇ రామన్, అసిస్టెంట్ కమీషనర్ వెంకటేశ్వర్లు,సెక్రెటరీఉమామహేశ్వరరావు, ఎసిపి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# రూ.50 కోట్ల వ్యయంతో ఏటిసి సెంటర్

## ప్రారంభించిన ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాగూర్



రామగుండం, జనంసాక్షి :రామగుండంలో అత్యాధునిక సాంకేతిక సదుపాయాలతో కూడిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ప్రారంభించిన ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ విద్యార్థుల అభివృద్ధి కోసం ఆధునిక సాంకేతికతను అందించడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు.50కోట్ల వ్యాయంతో ఈ ఏటీసీ సెంటర్‌ను ప్రారంభించామని,ఈ సెంటర్ ద్వారా స్థానిక యువతకు నూతన అవకాశాలు లభిస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.ప్రత్యేకంగా ఐటీ, స్కిల్ డెవలప్‌మెంట్, రోబోటిక్స్ వంటి రంగాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు అధికారులు వెల్లడించారు.ఈ సెంటర్ రామగుండం ప్రాంతానికి మైలురాయిగా నిలుస్తుందని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు.యువతకు ఉపాధి అవకాశాలు పెంచడానికి ఈ కేంద్రం ఉపయోగపడనుందనీ తెలిపారు.ప్రారంభం సందర్భంగా విద్యార్థులు, స్థానికులు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.తాజా సాంకేతిక పరిజ్ఞానం అందరికీ చేరేలా చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పారు.రామగుండంలో అభివృద్ధి దిశగా మరో అడుగుగా ఈ అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ నిలవనుందన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు వివిధ విభాగాల అధ్యక్షులు, తదితరులు ఉన్నారు.

# గంపగోవర్ధన్ ఎన్నికల్లో టికెట్ రాక మతిస్థిమితం తప్పి మాట్లాడుతున్నారు

## కైలాస్ శ్రీనివాసరావు



కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 27 (జనం సాక్షి)కామారెడ్డి పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో డిసిసి అధ్యక్షులు కైలాస్ శ్రీనివాసరావు పత్రిక సమావేశం నిర్వహించారుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంప గోవర్ధన్ ఎన్నికల్లో టికెట్ రాక మతిస్థిమితం తప్పి మాట్లాడుతున్నారని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అసమర్థ ప్రభుత్వమని మాట్లాడి తన పరువు తన పార్టీ పరువు తీసుకుంటున్నారు 10సంవత్సరాల పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు పేదలకు నియోజకవర్గానికి 10 ఇండ్లు కూడా ఇవ్వలేదుఫీజు రియంబర్స్మెంట్ ఇవ్వలేదు యువతకు ఉద్యోగాలు ఇవ్వలేదునోటిఫికేషన్ ఇవ్వాలి పేపర్ లీకులు చేసి సరిపెట్టుకోవాలి అంతే తప్ప ఉద్యోగం మాత్రం ఇవ్వలేదు కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంవత్సరాల్లో 65 వేల ఉద్యోగాలు ఇచ్చింది పేదలకు సన్న బియ్యం అందిస్తుందినియోజకవర్గానికి 3500 పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసిందిరెండు లక్షల రుణమాఫీ చేసింది అసమర్థ అంటే మీరు అద్దం ముందు నిలబడి చూసుకున్నట్టు ఉంటుంది ప్రభుత్వంపై విమర్శించే అవకాశం ఇవ్వకుండా పాలన అందిస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వం బిఆర్ఎస్ హయాంలో దోపిడి తప్ప అభివృద్ధి జరగలేదు కుటుంబం మొత్తం రాష్ట్రాన్ని దోచుకుంటే ఎమ్మెల్యేలంతా నియోజకవర్గం దోచుకున్నారు స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కనివిని ఎరుగని రీతిలో విజయం సాధిస్తుంది ఈ కార్యక్రమంలో పండ్ల రాజు కారంగులగోనే శీను, గుడుగుల శీను, లడ్డు, సత్యం, జమీల్, సర్వర్ తదితరులు పాల్గొన్నారు.

# కో టీ 50 లక్షలతో నిర్మాణం చేసిన సెంట్రల్ లైటింగ్ను

## ప్రారంభించిన ఎమ్మెల్యే విజయరమణారావు



సుల్తానాబాద్,సెప్టెంబర్ 27(జనంసాక్షి) : సుల్తానాబాద్ మున్సిపల్ నుండి పూసల రోడ్డు వరకు నూతనంగా కోటి 50 లక్షలతో నూతనంగా నిర్మాణం చేసిన సెంట్రల్ లైటింగ్ స్ట్రీట్ లైట్లు శనివారం పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ చైర్మన్ మి నుపాల ప్రకాష్ రావు, సింగల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్, మాజీ మార్కెట్ చైర్మన్ సాయి రి మహేందర్, కాంగ్రెస్ నాయకులు చింతల రాజు, అమీర్ శెట్టి రాజలింగం, కుమార్ కిషోర్, దున్నపోతుల రాజయ్య, అమిరిశెట్టి తిరుపతి, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు రవీందర్, పన్నాల రాములు, మున్సిపల్ మేనేజర్ అలీముద్దీన్, తా గ్రి కొండ ప్రభాకర్, కోట శ్రీనివాస్, మాజీ మార్కెట్ చైర్మన్ గజ బీమ్ కార్ జగన్, వేగోళం అబ్బయ్య గౌడ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ అంతటి పుష్పలత ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు.

# ఎంపీడీవో కార్యాలయంలో మహిళ రిజర్వేషన్‌కై డ్రా

పెద్ద కొడప్గల్ సెప్టెంబర్ 27 (జనంసాక్షి): పెద్ద కొడప్గల్ మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం వార్డుల వారీగా మహిళా రిజర్వేషన్ కై డ్రా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్చార్జి ఎంపీడీవో లక్ష్మీకాంత్ రెడ్డి 24 గ్రామ పంచాయతీలకు సంబంధించిన వార్డులలో మహిళా రిజర్వేషన్ ఎంపిక డ్రా సూచనలను సభాముఖంగా వివరించారు. తదనంతరం గ్రామాల వారీగా వార్డుల సంఖ్య, వార్డుకు కేటాయించిన రిజర్వేషన్ ను తెలియజేశారు. ఆయా గ్రామాలలో మహిళలకు కేటాయించాల్సిన వార్డులకై డ్రా తీశారు. ప్రభుత్వం గత సర్పంచ్ ఎన్నికలలో కాటేపల్లి తాండ గ్రామానికి ఎస్టీ రిజర్వేషన్ కేటాయించగా ఎస్టీలు లేకపోవడంతో ఎన్నికలు నిలిచిపోయాయి. ప్రస్తుత నూతన జాబితాలో బీసీ రిజర్వేషన్ కేటాయిస్తూ ఉత్తర్వులు రావడంతో తాండావాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా చావని తాండ గ్రామంలో ఎస్సీ రిజర్వేషన్ ఓటర్లు లేకున్నా నాలుగు వార్డులకు ఎస్సీ రిజర్వేషన్ కేటాయించడంతో గ్రామస్తులు అసహనం వ్యక్తం చేశారు. దీనిపై ఇన్చార్జి ఎంపీడీవో లక్ష్మీకాంత్ రెడ్డి స్పందిస్తూ ఉన్నతాధికారులు అందించిన జాబితా ప్రకారం తెలియజేయడం జరుగుతుందని, ఏమైనా సందేహాలు ఉంటే సంబంధిత శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, ఆయా గ్రామానికి చెందిన గ్రామస్తులు పాల్గొన్నారు.



# ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు



కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 27 (జనం సాక్షి)స్వరాష్ట్ర సాధనలో అలుపెరగని కృషి చేసిన నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జిల్లా ఎస్పి యం. రాజేష్ చంద్ర,కామారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో స్వాతంత్ర సమరయోధుడు, తొలి మలిదశ తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో కీలక భూమిక పోషించిన కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిం చబడ్డాయి. ఈ సందర్భంలో జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ మహనీయులు అని, మలిదశ తెలంగాణ ఉద్యమానికి తన ఇంటిని, ఆస్తులను సైతం దానం చేసి, స్వాతంత్ర పోరాటం, నిజాం నిరంకుశ వ్యతిరేక ఉద్యమం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఐదు దశాబ్దాలపాటు అలుపెరగని కృషి చేసిన దేశసేవకు అంకితమైన వ్యక్తి అని కొనియాడారు. ఆయన ఆలోచనలు, త్యాగం, ప్రజాసేవకు అంకితభావం అందరికీ ఆదర్శమని, యువత ఆయన జీవితం నుండి ప్రేరణ పొందాలి, సమాజానికి ఉపయోగపడే మార్గంలో నడవాలి అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ టి. శ్రీధర్, ఆర్ఐలు నవీన్, కృష్ణ, డిపిఓ సిబ్బంది, వివిధ వింగ్స్ సిబ్బంది మరియు ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

# రామ్ సేన అమ్మవారి మండపంలో కుంకుమ పూజ



మెట్ పల్లి, సెప్టెంబర్ 27,(జనం సాక్షి)మెట్ పల్లి పట్టణంలోని టీచర్స్ కాలనీలోని రామ్ సేన ఆధ్వర్యంలో ప్రతిష్టించిన దుర్గ దేవి మండపంలో అమ్మవారికి సామూహిక కుంకుమా ర్చన, అమ్మవారికి గాజుల అలంకరణ కార్యక్రమాలు నిర్వహించారు. మాతలు భక్తి శ్రద్ధలతో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామ్ సేన, సిద్ధి వినాయక కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## గ్రామ దేవత ఆలయం లో ఘనంగా గాజుల పండుగ



రాయికల్ సెప్టెంబర్ 27(జనం సాక్షి):రాయికల్ మండలంలోని వీరాపూర్ గ్రామంలోనీ గ్రామ దేవత పోచమ్మ ఆలయంలో మహిళలు ఘనంగా గాజుల పండుగ జరుపుకున్నారు.ఈ సందర్భంగా మహిళలు,ఆడ పిల్లలు అంత కలిసి ఒకరికొకరు సాంప్రదాయ పద్దతిలో పసుపు,కుంకుమ ధరిస్తూ,గాజులు వేసుకొని పండుగ సందడి చేశారు.అనంతరం పల్లె సంస్కృతి ప్రతిబింబించేలా ఉయ్యాల ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు.అందరూ కలిసి సహ పంక్తి భోజనం చేశారు.ఈ సందర్భంగా గ్రామ దేవత పోచమ్మ కు తమ పిల్ల పాపలు,కుటుంబ సభ్యులు,పంటలు బాగుండాలని కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## హైదరాబాద్‌కు తరలి వెళ్లిన మున్నూరు కాపు సంఘం నాయకులు



మంథని, (జనంసాక్షి) : మున్నూరు కాపు కులస్తులకు మంథని లో సంఘ భవనా నికి స్థలం, కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టాలని కోరు తూ ఐటీ, పరిశ్రమలు, శాస న సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు వినతి పత్రం సమర్పించేందుకు మున్నూరు కాపు సంఘం నాయకులు శనివారం హైదరాబాద్ కు బస్సుల్లో తరలివెళ్లారు. మంథనిలోని ఏఎంసి కార్యాలయం వద్ద నుండి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయిలి ప్రసాద్ ఆధ్వర్యంలో సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, ఏఎంసి చైర్మన్ కుడుదుల వెంకన్న, సింగిల్ విండో డైరెక్టర్ కొత్త శ్రీనివాస్, నాయకులు ఆకుల కిరణ్,శ్రీపతి బానయ్య, కూర కోటేశ్, కుడుదుల కోటయ్య, సేమంతుల ఓదెలు, ఎల్ల సత్యనారాయణ, అయిలి రవి, శ్రీనివాస్, పెంటరీ రాజు, లై శెట్టి రాజు, పెరుగు తేజ,తోగరి ఓదెలు, నరేడ్ల ఓదెలు, బాసనీ రమేష్,కుడుదుల మహదేవ్, ఇసంపల్లి శ్రీనివాస్,పెద్దసంఖ్యలోమున్నూరుకాపుసంఘంనాయకులు, కులస్తులు తరలివెళ్లారు.


## రాష్ట్ర తొలి,మలిదశ ఉద్యమకారుడు: కొండా లక్ష్మణ్ బాపూజీ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో



గాంధారి, సెప్టెంబర్ 27 (జనం సాక్షి)స్వతంత్ర సమరయోధుడు, తెలంగాణ తొలి మలి ఉద్యమకారుడు తెలంగాణ కోసం తన మంత్రి పదవిని సైతం వదులుకున్నటువంటి వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అని మాజీ జడ్పీటీసీ సభ్యుడు తానాజీరావ్ అన్నారు. బండి రాజు మాట్లాడుతూ.. సమరయోధుడు తెలంగాణ ఉద్యమకారులు ఆ దిశలో నడవాలని అన్నారు. 110వ జయంతిని పురస్కరించుకొని గాంధారి మండల కేంద్రంలోని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో బాపూజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఎంసి చైర్మాన్ పరమేష్, ఎస్ఐ ఆంజనేయులు, మాజీ సర్పంచి సంజీవ్, మాజీ ఎంపిటిసి తూర్పు రాజులు, పత్తి శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ పరమేష్, మాజీ ఏఎం సీ చైర్మాన్ సత్యం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు లైన్ రమేష్, బాబా, పద్మశాలి సంఘం మండల, పట్టణ అధ్యక్షులు అశోక్, రాజులు, సభ్యులు మహేష్, శ్రీనివాస్, శివ, నందం, తదితరులు, పాల్గొన్నారు.

## డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్, సెప్టెంబర్ 27 ( జనంసాక్షి ) : బోధన్ మండలం అమ్దాపూర్ గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ లబ్దిదారులకు శనివారం పట్టాలను బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చేతుల మీదుగా అందించారు. ఈ మేరకు గ్రామంలోని నిరుపేద కుటుంబాలను గుర్తించి 24 మందికి ఇండ్లను కేటాయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, మండల పార్టీ అధ్యక్షులు నాగేశ్వర్ రావ్, అమ్దాపూర్ కాంగ్రెస్ నాయకులు పల్లెన్న, జయ రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## కొండా లక్ష్మణ్ బాపూజీ 110 జయంతి

పిట్లం సెప్టెంబర్,27(జనం సాక్షి)పిట్లం మండల కేంద్రంలోని శివాజీ చౌక్ వద్ద జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ 110 వ జయంతి వేడుకలు బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది.ఈ కార్యక్రమం లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నీలకంఠ సంతోష్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, మూడు తరాల ఉద్యమ నేత, మాజీమంత్రి , డిప్యూటీ స్పీకర్,తెలంగాణ కోసం పదవులను త్యాగం చేసిన మొదటి వ్యక్తి, పీడిత ప్రజల పక్షపాతి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం జుక్కల్ నియోజకవర్గ ఇన్చార్జి ఆకుల లక్ష్మణ్ యాదవ్, యుత్ అధ్యక్షుడు కాటేపల్లి హన్మండ్లు, మండల యూత్ ఇన్చార్జ్ గొల్ల సాయి కిరణ్, బీసీ సంఘం మండల ఉపాధ్యక్ష ులు, చేనేత సంఘం అధ్యక్షులు సనపుల మధు కృష్ణ , సోషల్ మీడియా ఇన్చార్జ్ అఫ్రోజ్ సీనియర్ బీసీ నాయ కులు, నీలకంఠ సమాజంఅధ్యక్షులు మరగల దయానంద్, తదితరులు పాల్గొన్నారు

## అచంపేట్‌లో మహాజన సభ



నిజాంసాగర్ సెప్టెంబర్ 27 (జనంసాక్షి) నిజాంసాగర్ మండలం లోని అచ్చంపేట సహకార సంఘం లో శనివారం నాడు సంఘం అధ్యక్షుడు నర్సింహారెడ్డి అధ్యక్షతన మహాజన సభను నిర్వహిం చారు. ఈ సందర్భంగా సహకార సంఘం యొక్క జామా ఖర్చులను కార్యదర్శి సంగమేశ్వర్ గౌడ్ చదివి వినిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సహకార సంఘం ఆధ్వర్యంలో గోర్గల్ గేటు వద్ద నిర్మించిన కళ్యాణ మండపం సహకార సంఘం అభివృద్ధికి తోడ్పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు శ్రీని వాస్, డైరెక్టర్లు, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## బీసీలకు న్యాయం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం



నిజామాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 27 (జనం సాక్షి) : తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో బీసీలకు న్యాయం జరిగిందని బీర్కూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బోయిని శంకర్ పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42% రిజర్వేషన్ ను జీవో నెంబర్ 9 ద్వారా రిజర్వేషన్ కల్పించినందు కుగాను బీర్కూరు మండల కేంద్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశానికి స్వాతంత్రం సిద్ధించి 78 ఏండ్లు గడుస్తున్నప్పటికీ బీసీలకు ఇప్పటి వరకు రాజకీయంగా రిజర్వేషన్లలో న్యాయం జరగలేదని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఈనాటికి బీసీలకు న్యాయం జరిగిందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీర్కూర్ సొసైటీ చైర్మన్ ఇంగు రాములు, డిసిసి కార్యదర్శి కాంత్ రెడ్డి, లింగాయత్ జిల్లా అధ్యక్షులు బస్వరాజ్ పటేల్, మాజీ ఎంపీపీ రఘు, ఏఎంసీ వైస్ చైర్మన్ యామ రాములు, మాజీ ఎంపిటిసి సందీప్, నాయకులు మియాపూర్ శశికాంత్, కొరిమె రఘు, కిరణ్, రఫీ, మన్నన్, ఆరిఫ్, మొగులుగొండ, లక్ష్మీనారాయణ, మల్లాపురం సాయిలు, గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



పెద్ద కొడప్గల్ సెప్టెంబర్ 27 (జనంసాక్షి): మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద శనివారం కాంగ్రెస్ మండల అధ్యక్షులు మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయ కులు మాట్లాడుతూ... బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడం సంతోషకరమైన విషయం అని తెలిపారు. బీసీలకు సరైన న్యాయం చేసిన ఏకైక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని కొనియాడారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించినందుకు సీఎం కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు మహేందర్ రెడ్డి, సొసైటీ డైరెక్టర్ నాగిరెడ్డి, నాయకులు సంజీవ్, శామప్ప, సాయగౌడ్, అంజాగౌడ్, నాగరాజు, పాండు నాయక్, తదితరులు ఉన్నారు.

## డాక్టర్ బాలును అభినందించిన హైకోర్టు న్యాయమూర్తి నందికొండ నరసింహారావు



కామారెడ్డి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 27 (జనం సాక్షి) కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు ను హైకోర్టు న్యాయమూర్తి నందికొండ నరసింహారావు అభినందించి, సన్మానించడం జరిగింది. 18 సంవత్సరాల నుండి ఆపదలో ఉన్న వారికి రక్తాన్ని అందజేయడం ,తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం రెండు సంవత్సరాలలో ఐదువేల యూనిట్ల రక్తాన్ని సేకరించడం, వ్యక్తిగతంగా 77 సార్లు రక్తదానం చేసినందుకు అభినందించి, సన్మానించడం జరిగింది.ఈ అవకాశాన్ని కల్పించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ హెచ్ వి ఆర్ ఆర్ వరప్రసాద్,జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి న్యాయమూర్తి నాగరాణి, సూపర్ఇం డెంట్ వంచ చంద్రసేన్ రెడ్డి లకు డాక్టర్ బాలు కృతజ్ఞతలు తెలియజేశారు.రానున్న రోజుల్లో మరిన్ని రక్తదాన శిబిరాలను నిర్వహించి తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల ప్రాణాలకు కాపాడడానికి మరింతగా కామారెడ్డి రక్తదాతల సమూహం ఇంటర్నేషనల్ వైశ్యఫెడరేషన్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలు సంయుక్తంగాకృషి చేస్తామని అన్నారు.తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం రక్తదానం చేస్తున్న రక్తదాతలకు,సహకరిస్తున్న వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

## డాక్టర్ విద్యార్థిని సన్మానించిన కాంగ్రెస్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు



ఎడపల్లి, సెప్టెంబర్ 27 ( జనంసాక్షి ) : ఎడపల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన గిరిజన బిడ్డ, డాక్టర్ సీటు సాధిం చిన నేనావత్ దివ్యను శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు ఈరంటి లింగం ఘనంగా సన్మానించారు. ఎంబీబీ ఎస్ సీట్ కోసం ఒక పట్టుద లతో ఉన్నత చదువు చదివి మంచి ర్యాంక్ సాధించుకోవడం అభినందనీయమన్నారు. ఆయనతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వ్యక్తి అదృశ్యం

గంభీరావుపేట సెప్టెంబర్ 27(జనం సాక్షి ):గంభీరావుపేట మండ లం కేంద్రంలోని సముద్ర లింగాపూర్ గ్రామానికి చెందిన చెలువేరి ప్రశాంత్ వయసు 29 సంవత్సరాలు ఉపాధి నిమిత్తం హైదరా బాదులో ఉంటున్నాడు అప్పుడప్పుడు తన ఊరికి సముద్ర లింగాపూర్ వచ్చి వెళుతుంటాడు అదేవిధంగా 15 రోజుల క్రితం తన కొడుకు హైదరాబాదు నుండి వచ్చి రెండు రోజులు ఉండి తిరిగి హైదరాబాద్ వెళ్ళిపోయినాడని అప్పటినుండి తన కొడుకు ఫోను కలవడం లేదని అతని స్నేహితులను అడిగిన తన కొడుకు ఆచూకీ తెలియడం లేదని తన తండ్రి చెలువేరి బాలయ్య దరఖాస్తు ఇవ్వగా కేసు నమోదు చేసి విచారణప్రారంభించడంజరిగిందనిఎస్సైఅనిల్‌కుమార్ తెలిపారు.

# ఓక్కేసి పువ్వేసి చందమామ..

- వేములవాడలో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు
- వాడవాడల బతుకమ్మలతో మహిళలు,యువత సందడి

వేములవాడ, సెప్టెంబర్ 27 (జనంసాక్షి): ఓకే సి పువ్వేసి చందమామ.... ఏడు జాములయే సందమామ... అంటూ చిన్న పెద్ద తేడా లేకుండా బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. రాష్ట్రమంతటా తొమ్మిది రోజులకు సద్దుల బతుకమ్మ నిర్వహిస్తే, వేములవాడలో మాత్రం ఏడు రోజులకు సద్దుల బతుకమ్మ నిర్వహిస్తారు. పట్టణంలోని మహిళలు వేకువ జామనే గునుక, తంగేడు, చామంతి, పట్టుకుచ్చు, బంతి పూలు తెచ్చి బతుకమ్మ గా పేర్చి పట్టణంలోని వివిధ కుడలిలో పెట్టి ఆడి పాడారు. అనంతరం పట్టణ మూలవాగులోని బతుకమ్మ తెప్పె వద్ద బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ఈ వేడుకల్లో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా ఎస్పీ మహేష్ బి గితే, అడిషనల్ ఎస్పీ శేషాద్రిని రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు ప్రతాప రామకృష్ణ ,మున్సిపల్ కమిషనర్ అన్వేష్ పాల్గొన్నారు. అలాగే వేములవాడ పట్టణంతో పాటు శాత్రాజ్ పల్లి, వట్టెంలా, ఫాజుల్ నగర్, అనుపురం, కొడుముంజా,కోనయిపల్లి గ్రామాలలో సద్దుల బతుకమ్మను నిర్వహించారు.పట్టణంలో మున్సిపల్ అధికారులు పట్టణంలో పురవీధుల గుండా అన్ని ఏర్పాట్లు నిర్వహించారు. పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించి ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాటు చేశారు.









## అంబేద్కర్ యూనివర్సిటీ అడ్మిషన్‌లకు 10 వరకు గడువు..

**'ఖని' డిగ్రీ కాలేజీ కో-ఆర్డినేటర్ డాక్టర్ సుబ్బారావు..**

**గోదావరిఖని, జనంసాక్షి :** తెలంగాణ రాష్ట్రంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యునివర్సిటీలో డిగ్రీ మొదటి సంవత్సరంలో బిఎ., బీకాం., బీఎస్సీ కోర్సులలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్‌లకు అక్టోబర్ 10 వరకు గడువు పెంచడం జరిగిందని ప్రభుత్వ డిగ్రీ అండ్ పి.జి.కళాశాల అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ కో-ఆర్డినేటర్ డాక్టర్ సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు.ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థ లలో ఉద్యోగం చేస్తున్నవారు కూడా అర్హులేనని ఆయన పేర్కొన్నారు.అదే విధంగా రెగ్యులర్ ఇంటర్మీడియట్, ఓపెన్ ఇంటర్, ఐటిఐ, పాలిటెక్నిక్ డిప్లమా, ఒకేషనల్ కోర్సులు,10+2 కోర్సులలో ఉత్తర్ణులైన అర్హులని ఆయన తెలిపారు.డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరాలనుకున్న విద్యార్థులు ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 7382929655లో సంప్రదించాలని ఆయన కోరారు.





స్థానిక మార్కండేయకాలనీ రాజేష్ థియేటర్ కూడలి వద్ద ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ 110 వ జయంతి ఉత్సవాలు ప్రభుత్వపరంగా.. రామగుండం కార్పొరేషన్ ఏరియా పద్మశాలి సేవా సంఘం, అనుబంధ సంఘాలైన పోపా,మహిళ,యువజన సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు.

## డెంగ్యూతో బాలుడు మృతి..

**కోనరావుపేట (జనంసాక్షి):** డెంగ్యూతో మృతిచెందిన సంఘటన కొనరావుపేట మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే మండల కేంద్రానికి చెందిన పాక మహేష్ గంగాజలలా చిన్న కుమారుడు శ్రేయస్(4)కు గత నాలుగు రోజుల క్రితం జ్వరం రావడంతో సిరిసిల్ల ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు బాలుడి పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ప్రభుత్వం వెంటనే ప్రభుత్వ వైద్యశాలలో మెరుగైన వైద్యం అందించేలా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు



## కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

**కోనరావుపేట(జనంసాక్షి):** కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామానికి చెందిన దుంపేట రాజేశం, మంద రెడ్డి, సకినాల నరసింగం, మర్దన పేట కు చెందిన ముదాం ప్రవీణ్ నీరటి స్టీఫెన్, గుర్రం నవీన్ తదితరులతో పాటు సుమారు 30 మంది ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన వీరందరికీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు





## ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

### అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న ప్రభుత్వ విప్

**వేములవాడ, సెప్టెంబర్ 27 (జనంసాక్షి):** వేములవాడ పట్టణంలో సద్దుల బతుకమ్మ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మున్సిపల్ కార్యాలయం నుండి బతుకమ్మ తెప్ప వరకు నిర్వహించిన అమ్మవారి ఊరేగింపులో పాల్గొని, బతుకమ్మ తెప్ప వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. సద్దుల బతుకమ్మ, దసరా పండుగల కోసం రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు అధికారులు తెలిపారు. గతంలో పట్టణంలో 700 లైట్లను ఏర్పాటు చేస్తే, ఈసారి 900 పైచిలుకు లైట్లతో వేములవాడ మరింత వెలుగుల మేళవింపుతో మెరిసింది. రాష్ట్రమంతటా తొమ్మిది రోజులకు సద్దుల బతుకమ్మ నిర్వహిస్తే వేములవాడలో మాత్రం ఏడు రోజులకు జరపడం వల్ల వేములవాడ బతుకమ్మ ప్రత్యేకతగా నిలుస్తుంది. ఇక్కడికి వచ్చిన కొడళ్లు, పుట్టింటి ఆడబిడ్డలు తమ పూర్వీకుల ఇళ్లలో పండుగ జరుపుకుంటూ ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మను ఆరాధించారు. ప్రకృతి ఆరాధనకు, మహిళల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే ఈ బతుకమ్మ పండుగలో ప్రజలు బతుకమ్మ పాటలతో కష్టసుఖాలను, ప్రేమా ఆప్యాయతలను పంచుకున్నారు. మున్సిపల్ అధికారులు పట్టణ ప్రజలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు,ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐగా చల్లా వెంకట్రాజం బాధ్యతల స్వీకరణ

**వేములవాడ (జనంసాక్షి):** వేములవాడ రూరల్ మండల సబ్ ఇన్స్పెక్టర్ అఫ్ పోలీస్ గా శనివారం రోజు ఎస్ ఐ వెంకట్రాజం భాధ్యతలు స్వీకరించారు. గతం లో రూరల్ ఎస్ఐ గా వున్న అంజయ్య స్థానం లో వెంకట్రాజం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ ఐ వెంకట్రాజం మాట్లాడుతూ వేములవాడ రూరల్ మండల ప్రజలు శాంతి భద్రత లకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం అని, రౌడీ షీటర్ లు, సస్పెక్ట్స్, గ్రామాలలో శాంతి భద్రతల కు విఘాతం కలిగించే వ్యక్తుల పై ప్రత్యేక ద్రుష్టి పెట్టటం జరుగుతుంది అని, ఎవరైనా చట్ట పరిది దాటి ప్రవర్తిస్తే కఠిన చర్యలు ఉంటాయి అని అన్నారు.అనవసరంగా కేసులు చేసుకొని ఇబ్బంది పడొద్దు అని ప్రజల కోసమే పోలీస్ వుంది అని గ్రహించి ప్రజలు శాంతి భద్రతల కు సహకరించాలి అని సూచించారు.



# అంబరాన్నంటిన సద్దుల బతుకమ్మ సంబరాలు..

- మూలవాగు పూలవనంగా మారింది
- విద్యుత్ దీపాలకాంతుల వెలుగులో మూలవాగు
- గౌరీ మాత ఊరేగింపు
- బతుకమ్మ తెప్పపై ప్రత్యేక పూజలు
- రాజన్న సన్నిధిలో ఘనంగా సద్దుల బతుకమ్మ





**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 27 (జనంసాక్షి):**
ఏములాడ మూలవాగు పూలవనంలా మారిపోయింది. వేములవాడలో ఏడు రోజులలో సద్దుల బతుకమ్మ వేడుకలు జరుగుతున్న క్రమంలో తల్లిగారింట్లో, అత్తగారింట్లో సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించుకునేందుకు మహిళలకు అవకాశం ఉంటుంది. వేములవాడ రాజన్న సన్నిధిలో సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరానంటాయి.శనివారం పట్టణము లోని పలు కూడలిలోని ఆడపడుచులు బతుకమ్మ ఆటపాటలతో మార్మోగాయి.బతుకమ్మ తేప్పపై ప్రతిష్టించనున్న గౌరీమాతను ఉదయము మున్సిపల్ కార్యాలయం నుండి ప్రభుత్వ విప్, కమిషనర్ మేళతాళాలతో ఊరేగింపుగా బతుకమ్మ తెప్ప వద్దకు తరలించారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వేములవాడ పట్టణములో జరిగే సద్దుల బతుకమ్మ పండుగ ఏర్పాట్లు రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందన్నారు.వేములవాడ లో 7 రోజులకు బతుకమ్మ పండుగ జరుకోవడం రాష్ట్రంలోనే ఒక ప్రత్యేకత అని,ఇక్కడికి వచ్చిన కొడళ్లు, ఇక్కడి ఆడ బిడ్డలు తమ పుట్టినింట్ల,మెట్టినింట బతుకమ్మ పండుగ జరుపుకుంటరన్నారు.ప్రకృతి ఆరాధ్య పండుగ మహిళల ఆత్మ గౌరవానికి ప్రతీక బతుకమ్మ పండుగన్నారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అంటూ కష్టసుఖాలనూ, ప్రేమా ఆప్యాయతల్నీ బతుకమ్మ పాటలుగా మేళవించడం అందులో భాగమన్నారు.పూలను పూజించే గొప్ప పండుగ బతుకమ్మ పండుగని,మున్సిపల్ పక్షాన పట్టణంలో సద్దుల బతుకమ్మ, దసరాకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.గతంలో దసరా సందర్భంగా పట్టణంలో 700 లైట్స్ ఏర్పాటు చేస్తే ప్రస్తుతం 900 పై చిలుకు లైట్స్ ఏర్పాట్లు చేశామన్నారు.మహిళలు ఉదయం నుండి మార్కెట్లో పలు రకాల పూలను కొనుగోలు చేశారు. వీటిలో ప్రత్యేకంగా తంగేడు, గునక, చిట్టి చామంతి, పట్టు కుచ్చు, బంతి, చామంతి తదితర పూలను కొనుగోలు చేసి నియమ నిష్టలతో బతుకమ్మను పేర్చారు. బతుకమ్మను పేర్చిన పిదప పసుపుతో గౌరమ్మను తయారుచేసి తమ ఇంటిలోని దేవుడి ముందు బతుకమ్మను ఉంచారు.సాయంత్రం తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల్ని ప్రతిబింబించే విధంగా తమ నిత్య జీవితంలో కష్టసుఖాలను పాటలుగా మార్చి ఆడుతూ పాడారు. మహిళలు పలు కూడళ్లలో గుమి కూడి ఆటపాటలతో సంబరాలు నిర్వహించుకున్నారు. పట్టణంలోని రహదారులన్నీ మూలవాగులోని బతుకమ్మ తెప్ప వైపు బతుకమ్మలతో మహిళలు పెద్ద ఎత్తున తరలి వచ్చి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బతుకమ్మ తెప్పలో,మూలవాగులో నిమజ్జనం చేశారు. పోయిరా గౌరమ్మ.. పోయిరావమ్మా.. అంటూ బతుకమ్మ లకు ఘనంగా వీడ్కోలు పలికారు. మూలవాగులో మున్సిపల్ ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు నిర్వహించారు. మహిళల రాక కోసం ప్రత్యేక స్వాగత తోరణాలు, సుభాష్ నగర్ నుండి బతుకమ్మ తేప్ప వరకు రహదారిపై బారికేడ్లు ఏర్పాటు చేశారు. బతుకమ్మలతో వస్తున్న మహిళలపై పూల వర్షం కురిపించారు. నిమజ్జనం వద్ద మున్సిపల్ ఆధ్వర్యంలో వేదిక ఏర్పాటు చేసి మహిళలు బతుకమ్మలను నిమజ్జనం తీసుకొస్తున్న వారికి ప్రత్యేక ఆహ్వానం పలికారు.

**ఇస్తినమ్మ వాయినం..**

**పుచ్చుకుంటి వాయినం...**

బతుకమ్మలతో నిమజ్జనానికి తరలి వచ్చిన మహిళలు తమ ఇంట్లో తయారుచేసిన గౌరీదేవిని అర్ధించి నిమజ్జన అనంతరం ఆడపడుచులు పసుపు కుంకుమలు వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు. సనాతనంగా వస్తున్న సాంప్రదాయం ఇక నిమజ్జనానికి తమ వెంట తెచ్చుకున్న పిండి పదార్థాలు కూడ ఒకరికొకరు ఇచ్చి పుచ్చుకున్నారు.మూలవాగులో బతుకమ్మ నిమజ్జనం చేసిన అనంతరం మహిళలు స్వామివారిని, అమ్మవార్లను దర్శించుకుని ఆలయ ఆవరణలో మహిళలు కోలాటాలు,యువతుల దండియా నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

**బారి బందోబస్తు... ట్రాఫిక్ మళ్లింపు...**

బతుకమ్మ నిమజ్జనం సందర్భంగా శనివారము వేములవాడలో ఏఎస్పి శేషాద్రిని రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు 100 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించినట్లు పట్టణ సీఐ విర ప్రసాద్ తెలిపారు. బతుకమ్మ నిమజ్జనం బందోబస్తులో ఆధ్వర్యంలో ముగ్గురు సిఐలు,10 మంది ఎస్ఐలు, 12మంది హెడ్ కానిస్టేబుల్,58 మంది కానిస్టేబుల్, మహిళ కానిస్టేబుళ్లు,హోంగార్డులు, మఫ్టీలో కూడా కొందరు విధులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మూలవాగు బ్రిడ్జిపై నుండి కోరుట్ల బస్టాండ్ వెళ్లే ట్రాఫికు ను మొదటి బైపాస్ రోడ్డు వైపు మళ్లీస్తున్నామన్నారు.మల్లారం రోడ్డు నుండి రెండవ బైపాస్ రోడ్డులో రాకపోకలు నిషేధం చేశామన్నారు.కోరుట్ల బస్టాండ్ ప్రాంతం నుండి వచ్చే వాహనాలను చేక్కపల్లి రోడ్డు నుండి మొదటి బైపాస్ రోడ్డు మీదుగా మూలవాగు బ్రిడ్జి వరకు చేరుకునేలా ఏర్పాట్లు చేశామన్నారు. బతుకమ్మ తేప్ప వైపు వెళ్లేందుకు ఎలాంటి వాహనాలను అనుమతించడం లేదని, ఆ ప్రాంతానికి కాలినడకనే రావాలని, బతుకమ్మ తేప్ప పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నామని సిఐ తెలిపారు.



## ప్రజలందరిపై దుర్గామాత ఆశీస్సులు ఉండాలి

**- రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయం**

**- బీఆర్ఎస్ నాయకురాలు పూసల ప్రభావతిరెడ్డి**

**హుజూరాబాద్, సెప్టెంబర్ 27 ( జనం సాక్షి)**
కోరిన కోర్కెలు తీర్చే జగన్మాతమైన దుర్గాదేవి అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని బీఆర్ఎస్ నాయకురాలు పూసల ప్రభావతిరెడ్డి ఆకాంక్షించారు. దసరా ఉత్సవాలను పురస్కరించుకొని దేవి శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా బండ అంకూస్ ఏరియాలో ప్రతిష్టించిన దుర్గాదేవిని శనివారం ప్రభావతిరెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రభావతిరెడ్డి మాట్లాడుతూ...అమ్మ దయతో తెలంగాణలో రాబోయే ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని, ప్రజలందరికీ మంచి రోజులొస్తాయని అన్నారు. ప్రజలందరూ సుఖ సంతోషాలు, సిరిసంపదలతో వర్ధిల్లాలని దుర్గామాతను వేడుకొని పూజలు చేసినట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అన్ని మతాలు, కులాల వారికి, అన్ని పండుగలకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ప్రతాప మంజుల, మాజీ ఎంపీటీసీ కొయ్యడ శ్రీదేవి, లతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బోనస్ కోసం ఎడపల్లి మహాజన సభలో రైతుల నిరసన

**ఎడపల్లి, సెప్టెంబర్ 27 ( జనంసాక్షి ) :**
రైతులకు వరి బోనస్ చెల్లించాలని ఎడపల్లి మహాజన సభలో రైతులు నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం ఎడపల్లి సహకార సంఘం మహాజన సభను అధ్యక్షులు పోల మల్కారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ మేరకు సహకార సంఘం కార్యదర్శి రాజారాం సంఘం జమా ఖర్చు లెక్కలను చదివి వినిపించారు. అనంతరం సంఘ సభ్యులు గత సీజన్ లో వరికి బోనస్ చెల్లిస్తామని సర్కారు బోర్డు పెట్టి మరీ వరి కొనుగోలు చేయడం జరిగిందని అయితే ఇప్పటివరకు బోనస్ ను చెల్లించకపోవడంపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా అయితే ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిలిపివేసి రోడ్డు ఎక్కాల్సి వస్తుందన్నారు. ఈ మేరకు మాజీ ఉప సర్పంచ్ ఆకుల శ్రీనివాస్ ప్రతిపాదన మేరకు రైతులు బోనస్ చెల్లించాలని కోరుతూ రైతులు లేచినిలబడి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ తో పాటు సహకార సంఘం కార్యదర్శి రాజారాం, వైస్ చైర్మన్ కమలాకర్ రెడ్డి, సభ్యులు అనిల్ రెడ్డి, మొద్దోళ్ళ సురేష్, పరశురామ్ గౌడ్, నగేష్ గౌడ్, రాం రెడ్డి, రైతులు బంజ కామప్ప, రాజిరెడ్డి, గంగాధర్, పండరి, కేసరి శంకర్ గౌడ్, సిబ్బంది ప్రభాకర్ గౌడ్, రైతులు పాల్గొన్నారు.




## సైదాపూర్ జెడ్పీటిసి ఎంపీపీ ఎస్సీ మహిళ

### ఎన్నికల కమిషన్ కు కృతజ్ఞతలు తెలిపిన మట్టల రవీందర్



**సైదాపూర్ సెప్టెంబర్ 27 (జనంసాక్షి)**
మండల జెడ్పీటిసి గా ఎస్సీ మహిళకు సైదాపూర్ ఎంపీపీ ఎస్సీ మహిళ కేటాయిస్తూ ఎన్నికల సంఘం రిజర్వేషన్ ఖరారు చేయడం పట్ల భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ కృషి వల్లనే రాజకీయాలలో రిజర్వేషన్ వస్తున్నాయని తెలంగాణ రాష్ట్రంలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎస్సీ రిజర్వేషన్ సైదాపూర్ మండల జెడ్పిటిసిగా ఎంపీపీగా ఎస్సీ మహిళలకు కేటాయించడం పట్ల ఎమ్మార్పీఎస్ మండల సీనియర్ నాయకులు మట్టెల రవీందర్ సంతోషం వ్యక్తం చేస్తూ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణకు శ్రీకారం చుట్టిందని గత 30 ఏళ్లుగా పోరాట ఫలితమే ఈరోజు వర్గీకరణ రిజర్వేషన్ అందుతున్నాయని మట్టెల రవీందర్ ఆనందం వ్యక్తం చేశారు.

# ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలు కొనసాగించాలి

**మిట్టపల్లి ప్రవీణ్ కుమార్**



సుల్తానాబాద్, సెప్టెంబర్ 27 (జనంసాక్షి) : ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను కొనసాగించాలని బిజెపి నేత సామాజికవేత్త మిట్టపల్లి ప్రవీణ్ కుమార్ సూచించారు. ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకొని శనివారం మున్సిపాలిటీలోని చేనేత సహకార సంఘంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి పూలమాలవేసి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పద్మశాలి జిల్లా, మండల,మున్సిపాలిటీ నాయకును, చేనేత కార్మికులను మిట్టపల్లి ప్రవీణ్ కుమార్, శాలువాతో ఘనంగా సన్మానించారు, ఈ సందర్భంగా, మిట్టపల్లి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ మొదటి దశ తెలంగాణ ఉద్యమం కొరకై తన మంత్రి పదవిని త్యాగం చేసిన గొప్ప వ్యక్తి అని తెలంగాణ మలి ఉద్యమం కొరకై తన సొంత ఇంటిని త్యాగం చేసిన గొప్ప త్యాగధనుడని కొనియాడారు, ఈ,కార్యక్రమంలో పద్మశాలి జిల్లా నాయకులు వేముల రామ్మూర్తి, ఓదెల శ్రీ మల్లికార్జున స్వామి టెంపుల్ చైర్మన్ చీకట్ల మొండయ్య, మిట్టపల్లి మురళీధర్, ఐల రమేష్, సాయిరి మహేందర్,గుండా మురళి,సామల హరికృష్ణ,సామల రాజేంద్ర ప్రసాద్,పద్మశాలి కుల బాంధవులు చేనేత కార్మికులు పాల్గొన్నారు.

# తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ పండుగ

**ఆర్జీ-2 ఎస్ఓటుజీఎం మాలోత్ రాముడు**





యైటింక్లయిన్ కాలనీ సెప్టెంబర్ 27 (జనంసాక్షి) : తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ పండుగయని ఆర్జీ-2 ఎస్ఓటుజీఎం మాలోత్ రాముడ్ అన్నారు. శనివారం రాత్రి సీఈఆర్ క్లబ్ సేవా సమితి ఆధ్వర్యంలో ఎస్ఓటుజీఎం రాముడు దంపతులు జ్యోతి ప్రజల్వన చేసి వేడుకలను ప్రారంభించి మాట్లాడారు. ఈ సంధర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ఆయన మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ పండుగ, ఫ్యామిలీ డే వేడుకలను జరుపుకోవడం గొప్పవిషయమన్నారు. తెలంగాణ సంస్కృతిని చాటే బతుకమ్మ పండుగ ప్రతి ఇంటిలో భోగభాగ్యాలను కలిగిస్తుందన్నారు. కులాల మతాలకతీతంగా అందరూ కలిసి చేసుకునే బతుకమ్మ పండుగ ప్రతి ఒక్కరికి ఆనందాన్ని కలిగిస్తుందన్నారు. అత్యంత సుందరంగా పేర్చి తీసుకు వచ్చిన బతుకమ్మలకు ఎస్వోటుజీఎం బహుమతులను అందజేశారు. ఆనంతరం చిన్నారులు చేసిన సాంస్కృతి కార్యక్రమాలు ఎంతగానో ఆలరించాయి. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి బ్రాంచి కార్యదర్శి జిగురు రవీందర్, ఏరియా సేఫ్టీ అధికారి ఎస్. సంతోష్ కుమార్, ఏరియా ఇంజనీర్ సుజన్ మెహ్రా, పిఓ ఉదయ్ హరిజన్, డీజీఎం పర్సనల్ అరవిందరావు, డీజీఎంలు ఎర్రం వెంకటరామిరెడ్డి, ధనుంజయ్, డివైపిఎం వంశీధర్, సీనియర్ పిఓ ఎస్ సాధన్, అధికారులు రాజేందర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, డా.మహిపాల్, ప్రతాపగిరి రాజు, వినయ్ సాగర్, సురేష్, సంక్షేమాధికారులు సురేష్, నరేష్, అజీజ్, సేవా సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల విధులలో దీర్ఘాకాలిక వ్యాది గస్తులకు, గర్భిణీలకు మినహాయింపు ఇవ్వాలి

**టిఎస్‌యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు తిరుకోవెల శ్యామ్ సుందర్**



జగిత్యాల బ్యూరో సెప్టెంబర్ 27 (జనంసాక్షి) త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలలో విధులు నిర్వహించబోతున్న ఉపాధ్యాయులలో వికలాంగులు, దీర్ఘాకాలిక వ్యాధులు గలవారు, గుర్భిణీ ఉపాధ్యాయులు, పదవి విరమణకు దగ్గరలో ఉన్నవారిని, చిన్న పిల్లలు గల మహిళా ఉపాధ్యాయులకు మానవతా దృక్పధంతో ఎన్నికల విధుల నుండి మినహాయింపు ఇవ్వాలని స్థానిక సంస్థల అదనపు పరిపాలనధికారి కి ప్రతినిధ్యం చేయడం జరిగింది.. కార్యక్రమంలో అధ్యక్షప్రధాన కార్యదర్శులు తిరుకోవెల శ్యామ్ సుందర్, అంబటి భూమేశ్వర్ పాల్గొన్నారు.

# అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చెర్యలు



నిజంసాగర్ సెప్టెంబర్ 27 (జనంసాక్షి) మండలంలో అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నిజంసాగర్ ఎస్సై శివకుమార్ అన్నారు. మండలంలోని పెద్ద ఆరేపల్లి గ్రామ శివారులోని స్మశాన వాటిక పరిసరాలు మంజీరా వాగు నుండి శనివారం నాడు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులు, ట్రాక్టర్లును అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అక్రమ ఇసుకను తరలిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

# మున్సిపల్ కార్యాలయంలో బతుకమ్మ సంబరాలు

సుల్తానాబాద్,సెప్టెంబర్ 27(జనంసాక్షి) : మండల కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. శనివారం మహిళా ఉద్యోగిని లు, మెప్మాలు మాజీ సర్పంచ్ అంతటి పుష్పలత లు ప్రకృతి లో లభించే తీరొక్క పూలతో ఆకర్షణీయమైన బతుకమ్మలు వివిధ రూపాలలో అందంగా అలంకరించి బతుకమ్మలను ఒకచోట పేర్చి వలయకారంగా తిరుగుతూ తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలైన బతుకమ్మ పాటలను వల్లే వేశారు. బతుకమ్మ ఆటలు ఆడారు. ఈ సందర్భంగా వేడుకలకు హాజరైన పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు మాట్లాడుతూ, ఈ తరం మహిళ లోకం మన సంస్కృతి సాంప్రదాయాలు తెలియపరచడం ముఖ్యమని అన్ని దేవతలను పూలతో పూజిస్తే పూలనే దేవతగా పూజించే పండగ మన బతుకమ్మ అని తెలిపారు. మహిళ లోకానికి గౌరమ్మ ఆశీస్సులు ఉండి చక్కని ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలను అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్, మండలంలోని ప్రజా ప్రతినిధులు తాజా మాజీ నాయకులు లతోపాటు మున్సిపల్ కార్యాలయ ఉద్యోగులు సతీష్, టి ఓ రాజకుమార్, క్రాంతి కుమార్, మెప్మా స్వరూప, ఆర్పీలతోపాటు పట్టణంలోని పలువురు మహిళలు పాల్గొన్నారు.



# చేనేత కార్మికుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా

**- ఎమ్మెల్యే విజయ రమణారావు.. - ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు**



సుల్తానాబాద్,సెప్టెంబర్ 27(జనంసాక్షి) : చేనేత కార్మికుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తానని, పెద్దపల్లి,ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు తెలిపారు.తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమకారుడు, మాజీ మంత్రి కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను శనివారం సుల్తానాబాద్ పట్టణంలోని చేనేత సహకార సంఘంలో ఘనంగా నిర్వహించారు.పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ రమణారావు మాట్లాడుతూ చేనేత కార్మికుల సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి, చేనేత మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకు వెళ్తానని చెప్పారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సుల్తానాబాద్ చేనేత సహకార సంఘం, పద్మశాలి సంఘం ప్రతినిధి బృందాన్ని సీఎం, మంత్రి తుమ్మల వద్దకు తీసుకువెళ్లి చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. మండల పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు గుండా మురళి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్య గౌడ్, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు మినుపాల ప్రకాశరావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, ఓదెల శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానం అధ్యక్షుడు చీకట్ల మొండయ్య, జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు వేముల రామ్మూర్తి, జిల్లా ఉపాధ్యక్షులు సాయిరి మహేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఐల రమేష్, జిల్లా పద్మశాలి సంఘం యువజన విభాగం అధ్యక్షుడు మేరుగు యాదగిరి, బిరుదు కృష్ణ, ఏజిపి దూడం ఆంజనేయులు, గురు స్వామి మిట్టపల్లి మురళి, గోలి శ్రీనివాస్, సామల హరికృష్ణ, సామల రాజేంద్రప్రసాద్, పన్నాల రాములు, మేరుగు వెంకటేశం, అమిరిశెట్టి రాజలింగం, ఆడెపు సదానందం, ఎలిగేటి రమేష్, గోలి శ్రీనివాస్, కామని వెంకటరమణ, పల్లా సురేష్, మేడి శ్రీనివాస్, విష్ణు, వసీం,తదితరులు పాల్గొన్నారు.



# ఊరిఊరికో గుడిగుడికో జమ్మిచెట్టు





**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 27 (జనంసాక్షి) :** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని శనివారం బిఆర్ఎస్ మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గొంగడి సునీత,సుమిత్ర ఆనంద్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయ ఆవరణలో జమ్మి మొక్క నాటరు.మాజీ రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్ కుమార్ చేపట్టిన ఊరు ఊరికో జమ్మి చెట్టు గుడి గుడికో జమ్మి చెట్టు కార్యక్రమంలో భాగంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఆవరణలో శమి మొక్క నాటిన అనంతరం వారు మాట్లాడుతూ దసరా పండుగ రోజున ఊరు ఊరికో జమ్మిచెట్టు గుడి గుడికో జమ్మిచెట్టు నాటాలని మన తరతరాలుగా వస్తున్న జిమ్మి చెట్టు ప్రాధాన్యతను భావితరాలకు తెలియజేసేలా మంచి కార్యక్రమం ప్రారంభించమన్నారు.ఆలయ ఆవరణలో గ్రీన్ ఇండియా హరితసేనల ఆధ్వర్యంలో జమ్మి మొక్క నాటడం జరిగిందన్నారు. అనంతరం సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొని బతుకమ్మ ఆటపాటలాడి మూల వాగులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సుమిత్రానంద్,మాజీ జిల్లాపరిషత్ చేర్ పర్సన్ తుల ఉమ,మాజీ జిల్లా పరిషత్ చేర్ పర్సన్ అరుణ,మాజీ మున్సిపల్ చేర్ పర్సన్ మాధవి రాజు,గోలి మహేష్ ,విజయ్,సుశీల లరెడ్డి,రుద్ర రాధ, నిర్మల, గంటల రేణుక, కీర్తిలత, అరుణ, హరిత సేన ప్రతినిధులు మాధురి, కమల్ గౌడ్ పాల్గొన్నారు.









## మూలవాగు పూలవనం




ఏములాడ మూలవాగు పూలవనంలా మారిపోయింది.వేములవాడలో ఏడు రోజులలో సద్దుల బతుకమ్మ వేడుకలు జరుగుతున్న క్రమంలో తల్లిగారింట్లో, అత్తగారింట్లో సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించుకునేందుకు మహిళలకు అవకాశం ఉంటుంది. వేములవాడ రాజన్న సన్నిధిలో సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరానంటాయి.



పూజలు నిర్వహిస్తున్న ప్రభుత్వ విప్

అంబరాన్నంటిన సద్దుల బతుకమ్మ సంబరాలు
గౌరీ మాత ఊరేగింపు..
బతుకమ్మ తెప్పపై ప్రత్యేక పూజలు
రాజన్న సన్నిధిలో ఘనంగా సద్దుల బతుకమ్మ



## భారీ బందోబస్తు.. ట్రాఫిక్ మళ్లింపు

బతుకమ్మ నిమజ్జనం సందర్భంగా శనివారము వేములవాడలో ఏఎస్పి శేషాద్రిని రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు 100 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించినట్లు పట్టణ సీఐ విర ప్రసాద్ తెలిపారు. బతుకమ్మ నిమజ్జనం బందోబస్తులో ఆధ్వర్యంలో ముగ్గురు సిఐలు,10 మంది ఎస్ఐలు,12మంది హెడ్ కానిస్టేబుల్,58 మంది కానిస్టేబుల్,మహిళ కానిస్టేబుళ్లు, హెూంగార్డులు, మఫ్టీలో కూడా కొందరు విధులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మూలవాగు బ్రిడ్జిపై నుండి కోరుట్ల బస్టాండ్ వెళ్లే ట్రాఫికు ను మొదటి బైపాస్ రోడ్డు వైపు మళ్లీస్తున్నామన్నారు. మల్లారం రోడ్డు నుండి రెండవ బైపాస్ రోడ్డులో రాకపోకలు నిషేధం చేశామన్నారు.కోరుట్ల బస్టాండ్ ప్రాంతం నుండి వచ్చే వాహనాలను చేక్కపల్లి రోడ్డు నుండి మొదటి బైపాస్ రోడ్డు మీదుగా మూలవాగు బ్రిడ్జి వరకు చేరుకునేలా ఏర్పాట్లు చేశా మన్నారు. బతుకమ్మ తేప్ప వైపు వెళ్లేందుకు ఎలాంటి వాహనాలను అనుమతించడం లేదని, ఆ ప్రాంతానికి కాలినడకనే రావాలని, బతుకమ్మ తేప్ప పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నామని సిఐ తెలిపారు.

శనివారం పట్టణము లోని పలు కూడలిలోని ఆడపడుచులు బతుకమ్మ ఆటపాటలతో మార్మోగాయి.బతుకమ్మ తేప్పపై ప్రతిష్టించనున్న గౌరీమాతను ఉదయము మున్సిపల్ కార్యాలయం నుండి ప్రభుత్వ విప్, కమిషనర్ మేళతాళాలతో ఊరేగింపుగా బతుకమ్మ తెప్ప వద్దకు తరలించారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వేములవాడ పట్టణములో జరిగే సద్దుల బతుకమ్మ పండుగ ఏర్పాట్లు రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందన్నారు.